# మరనాత మెసేంజర్

క్రైస్తవ ఆధ్యాత్మిక మాసపత్రిక

# MARANATHA MESSENGER

వీరందరికి అభినందనలు





సిలువను గూర్చిన వార్త,
నశించుచున్న వారికి వెర్రితనము గాని
రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తి

1 కొరింథి 1:18







విడి ప్రతి
రూ.10/-

సంపుటి 37 మార్చి 2019 సంచిక 3



మరనాత
బిబ్లికల్ సెమినరీ
విజయవాడ
Accredited by
Asia Theological Association &
Christ For The Nations Association of Bible Schools
కోర్సులు కాలపరిమితి బోధనాభాష
B.Th 3 సంవత్సరాలు ఇంగ్లీష్ & తెలుగు
Dip.Th 2 సంవత్సరాలు తెలుగు
C.Th ఒక సంవత్సరం తెలుగు
జూన్ 24 నుండి క్లాసులు ప్రారంభం
అభిషిక్తులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధన.
డైరెక్టర్
శ్రీ అల్లూరి విశ్వప్రసాద్
సమ్మర్ కోర్స్
2019
ఏప్రిల్ 8 - మే 17 వరకు
కంప్యూటర్, సంగీతము, ప్రత్యేకమైన లైబ్రరి తరగతులు.
శిక్షణానంతరం సేవచేయుటకు సలహా సహకారాలు అందించబడును.
విశిష్టతలు
ఆత్మీయ సంఘంలో, చాపెల్ సర్వీస్‌లో దేవునితో అద్భుతమైన ఆరాధన అనుభూతి.
అర్హులైనవారు అప్లికేషన్ నిమిత్తం రూ.200/- పంపి పొందగలరు.
Spoken English Courses
ATA Curriculum
విద్యార్థినీ విద్యార్థులకు, వివాహితులకు ప్రత్యేక వసతి.
వ్యక్తిగత శ్రద్ధ, సహకారము, సిద్ధాంత మరియు ఆచరణాత్మక నైపుణ్యాల సమన్వయము.
అత్యాధునిక వసతులు గల క్యాంపస్
మరనాత విశ్వాస సమాజము
గాయత్రీనగర్, విజయవాడ.
E-mail : mvpvja8@gmail.com
9642793777
9441308156, 7799212199

R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Krishna Lanka, VIJAYAWADA - 520 013.
Printed on 11-03-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month



శిక్షణ పొందండి ! శిష్యులనుగా చేయండి!!

# మరనాత వేద పాఠశాల – విశాఖ

## మరనాత విశ్వాస సమాజపు పరిచర్య

'దైవసేవ - దేశసేవా తత్పరులైన యువతకు అద్భుత అవకాశం'


దైవజనులు శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారు

జన్మ, కర్మ పాప బంధితులు, బానిసలైన మానవాళికి యేసుక్రీస్తు యొక్క అవతారంలో విముక్తి లభ్యమైనది. ఈ గొప్ప సువార్తను ప్రజలు విశ్వసించి, పాప విమోచన, ఆత్మ రక్షణ పొందాలంటే ఈ శుభవార్తను తెలుగువారికి చాటించే వారుండాలి. అందుకు సుశిక్షితులైన యువత కావాలి! రావాలి!! అందుచేతనే స్వయాన ప్రభువు వారే "కోత విస్తారమేగాని పని వారు కొద్దిగా ఉన్నారు" అని వాపోయారు.

ఇటువంటి దైవసేవ చేయాలనే ఆశ, దేవుడు పిలిచాడనే నిశ్చయత మరియు ఆయన పనిపట్ల సమర్పణ గలవారికి వాక్య సేవా తర్ఫీదు నివ్వాలనే దర్శనంతో 'మరనాత వేద పాఠశాల' 33 సంవత్సరాల క్రితం దైవదాసులు శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారిచే స్థాపించబడింది.

**నిర్వహించే కోర్సులు :**

1) Diploma in Biblical Studies (D.B.S) రెండు సం।।లు (4 సెమిస్టర్లు)
2) Bachelor of Theology (B.Th) మూడు సం।।లు (6 సెమిస్టర్లు)
3) 40 రోజుల వేసవి వేదపాఠశాల (ఏప్రిల్ 9- మే నెల 19 వరకు)



అర్హతలు : రక్షణానుభవము, సేవార్హమైన దేవుని పిలుపు, సమర్పణ, 18 సం।।లు పైన వయస్సు గలవారు.

**స్త్రీలకు ప్రత్యేక వసతి**

వాక్యతర్ఫీదు పొందవాలనే ఆసక్తి గలవారు అప్లికేషన్ నిమిత్తము రూ.100/-లు పంపి, పొంది, పూర్తి చేసి వెంటనే పంపించవలెను. భోజనము, వసతి : ఉచితం; బోధనా భాష : తెలుగు.




**ప్రత్యేకతలు :**

- ఉన్నత విద్యార్హతలు
- వాక్య పరిజ్ఞానము
- స్వదేశీ, విదేశీ సేవానుభవం కల్గిన అధ్యాపక బృందం మరియు
- వ్యక్తిగత శ్రద్ధ
- క్రమశిక్షణ
- సిద్ధాంత, ఆచరణాత్మక పద్ధతుల సమన్వయము.

**వివరములకు :**

రెవ. శీలపురపు సైలస్ ప్రకాష్
M.Com., M.Div. (USA)
డైరెక్టర్, మరనాత వేద పాఠశాల
50-43-9, టి అండ్ టి కోలని, సీతమ్మధార,
విశాఖపట్నం-530013.
✆ : 98481 24651,
9949590555, 8897884111
maranathavisakha@gmail.com



# ఈ సంచికలో


1. లూకా సువార్త - 33 - శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి

2. ఆధ్యాత్మిక విజ్ఞాన ధారావాహిక -18 - డా॥ నిరీక్షణ కె. కంచర్ల

3. ప్రమాదపు అంచుల్లో - సహోదరి ఎ. ఉషారాణి

4. కృతజ్ఞతా భావన - డా॥ మనష్షే కొటారి

5. ఎఫెసీ పత్రిక - 7 - రెవ. అల్లూరి విశ్వప్రసాద్

6. 'అట్టివారై యుండుడి ' - 17 - రెవ. బి.యం. రాజు

7. వార్తల్లో కొన్ని - సంపాదకులు



ప్రధాన సంపాదకులు : శ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి

సంపాదక వర్గం :

రెవ. ఫైలప్ ప్రకాష్, రెవ.డా॥ నిరీక్షణ కంచర్ల, రెవ. బి.యం.రాజు, రెవ.జి.యేసుదాసు


మీ చందాలు, వ్యాసములు ఈ క్రింది చిరునామాకు పంపించండి


**మరనాత మెసేంజర్, గాయత్రి నగర్, విజయవాడ - 520 008.**

**Phone : 0866 - 2480047      e-mail : mvs828@gmail.com**


**: Bank Details :**

**THE SOUTH INDIAN BANK LTD.**

**A/c. No. 0142073000000861    IFSC : SIBL0000414**

**ప్రకటన వివరాలు**

పూర్తి పేజి : రూ. 1,500/-    అరపేజి : రూ. 800/-

టైటిల్ పేజి 3 లేక 4 : పూర్తి పేజి రూ. 3,000/-    అరపేజి రూ.1,500/-

| | స్వదేశములో | విదేశములో |
|---|---|---|
| సాలుసరి చందా | రూ. 150/- | రూ. 1,000/- |
| పోషక సభ్యత్వం | రూ. 1,000/- | రూ. 3,000/- |
| జీవిత సభ్యత్వం | రూ. 5,000/- | రూ. 15,000/- |


This Magazine is Printed, Published and Owned by G. Moses Choudary & Printed at Alpha & Omega Publications & Printing Works, # 59-8/1-6/3, Gayatri Nagar, Vijayawada - 520 008. This Magazine is Edited by G. Moses Choudary, # 59-8/1-6/3, Gayatri Nagar, Vijayawada - 520 008.

# లూకా సువార్త
## (33 వ భాగము)

శ్రీ జి. మోజెస్ చౌదరి, విజయవాడ

## ఫలించు నేల - ఫలించని నేల : (లూకా సువార్త 8 : 4-15)

పాఠకమిత్రులకు ప్రభువైన యేసుక్రీస్తు నామములో శుభములు, ఆశీస్సులు కలుగునుగాక!

దేవునియొక్క మంచితనము, దీర్ఘశాంతము, దయాళుత్వము, విశ్వాస్యత మనమెంతో అనుభవించే అవకాశము ఉంది. ఈ దేవునియొక్క దివ్యమైన ఆజ్ఞలు, దైవికమైన సూత్రాలు పరిశుద్ధ బైబిల్ నుంచి అధ్యయనం, అభ్యాసం చేస్తూ ఆచరణలో పెడితే, అద్భుతమైన దీవెనల సిరులు మనం పొందుకోవడం సాధ్యమే. అట్టి దీవెనలు, ప్రశాంతతను అనుభవిస్తూ ఈ లేఖన వ్యాసంగాలు మీకు అందిస్తూఉన్నాం.

యేసు మానవావతారిగా జీవించిన కాలంలో పాదచారిగా సంచారంచేస్తూ దైవబోధ లందించేవాడు. ఆయనదగ్గరకు ప్రజలు తండోపతండాలుగా పల్లెలు, పట్నాలు నుంచి వచ్చేవారు. వాళ్లనుద్దేశించి అద్భుతమైన ఉపదేశాలు చెప్పేవాడు. అనేకమార్లు ఉపదేశము లు ఉపమానరీతిగా చెబుతూవచ్చాడు. యేసు ఉపమానరీతిగా చెప్పిన ఒక సందేశాన్నిగూర్చి మీతో పంచుకోవాలని...

**"విత్తువాడు తన విత్తనములు విత్తుటకు బయలుదేరెను. అతడు విత్తుచుండగా, కొన్ని విత్తనములు త్రోవప్రక్కన పడి త్రొక్కబడెను గనుక, ఆకాశపక్షులు వాటిని మింగివేసెను. మరి కొన్ని రాతినేలను పడి, మొలిచి, చెమ్మలేనందున ఎండిపోయెను. మరి కొన్ని ముండ్లపొదల నడుమ పడెను; ముండ్లపొదలు వాటితో మొలిచి వాటినణచి వేసెను. మరికొన్ని మంచినేలను పడెను; అవి మొలిచి నూరంతలుగా ఫలించెననెను. ఈ మాటలు పలుకుచు - వినుటకు చెవులు గలవాడు వినునుగాక అని బిగ్గరగా చెప్పెను" (లూకా 8 : 4-8).** ఈ ఉపమానములో వివిధరకాల నేలలు, ఫలించడములోఉన్న వివిధ స్థాయిలు, దానియొక్క భావమును ప్రభువైన యేసు వివరించెను **(లూకా 8 : 9: 15)**.

మనము గమనించవలసింది ఏమిటంటే - విత్తేవాళ్లకు వివేకం చాలా అవసరము. మట్టిలేని రాతిమీద, రోడ్డుమీద, ముండ్లపొదల్లోను విత్తనాలు చల్లముకదా, నేలను పరీక్షించి ఏమట్టిలో ఏవిత్తనం ఫలిస్తుందో, ఏది ఏపుగాపెరిగి మంచి కాపునిస్తుందో ఎరిగిన వాడైన రైతు అలాగే సాగుచేస్తాడుకదా. విత్తనం మంచిది, అందులో ఏలోపము లేదు. ప్రభువు యొక్క సువార్త సందేశము ఆవిత్తనమునకు సాదృశ్యం కాగా, సాక్షాత్తూ యేసుక్రీస్తు శిష్యగణమైన మాబోంట్లు (దైవసేవకులు) ఇక్కడ విత్తనాలు విత్తేవారుగా కనబడుతున్నారు. దేవుని అద్భుతమైన శక్తి మహాత్యాలు అందులో పొందుపర్చబడి ఉన్నాయి. దైవసేవకులు, సువార్తికులు సందర్భోచితంగా ప్రజలకు సువార్త సందేశాన్ని అందించడం అలవర్చుకోవాలి.

అందుకు దేవుని ప్రార్థించినట్లయితే ప్రభువే వివేకమును, విజ్ఞతను, వివేచనను మనకు అనుగ్రహిస్తాడు. సువార్త సందేశం ఫలించే విధమును మనం ధ్యానం చేస్తున్నాం. విత్తనములు విత్తమని (సువార్త ప్రకటించుమని) దేవుడు నాకు ఇచ్చిన ఆజ్ఞానుసారంగా, చదువరులైన మిమ్ములను నేను ఎంతగానో అభినందిస్తూ - ఈ దైవ సందేశాలు (విత్తనాలు) మీ హృదయమనే భూమిలో పడి ఫలించాలని ఎంతో ఆశిస్తున్నాను. విత్తనాలు వేయబడిన ఈ నాలుగు రకాల భూములగురించి మనం ఒకింత ధ్యానంచేద్దాం.

**మొదటిరకపు నేల - 'త్రోవ ప్రక్కన' :-** విత్తనాలు త్రోవప్రక్కన పడినట్లయితే అవి మొలకెత్తడం కష్టంకదా. అది కాలిబాట కాబట్టి మట్టిఅయితే ఉంది కాని కాలగమనాన అది గట్టిపడిపోయి, రాటుదేలిపోయినందున విత్తనాలు చల్లినవెంటనే ఆకాశ పక్షులు ఎత్తుకు పోయినట్లుగా- సువార్త చాలామంది వినడమైతే శ్రద్ధగా వింటారు కాని, విన్నవార్త వాళ్లలో నిలబడటము లేదు. దాన్ని తమలో పదిలముగా ఉంచుకోలేక పోతున్నారు. ఎందుకంటే పడింది పడినట్లు ఆకాశపక్షులవంటి దురాత్మల సమూహము ఎత్తుకొని పోతోంది. అపవాది యొక్క, దురాత్మల యొక్క ప్రభావము వలన వాళ్లు విన్న దేవుని వాక్యమును వదిలేస్తారు.

**రెండవ రకపు నేల - 'రాతినేల' :-** రాతినేలమీద మట్టి లోతుగా లేదు, కాని కొంచెం పలుచగాఉంది. అందుచేత విత్తనం పడగానే అక్కడున్న కొద్దిపాటి తేమవల్ల మట్టిలోనుంచి మొలక వచ్చింది కాని, కాలగమనాన ఎండకి ఆ తేమ ఆరిపోయి విత్తనం కూడ త్వరగా ఎండిపోయింది. అంటే, చాలామంది సువార్తను వింటున్నారు, ప్రభువంటే మాకుకూడ ఇష్టమండీ, మీ సందేశాన్ని టీ.వీ. లో వింటున్నాము, బాగా చెబుతున్నారు, మీ భాష బాగుందంటూ మమ్మును అభినందిస్తారు. వారెంతైనా అభినందనీయులు, కానీ అసలు ఈ సువార్త సందేశాలు మీలో ఎంత లోతుగా నాటుకొంటున్నాయి? దేవుని వాక్యమును హృదయంలో ఎంత పదిలంగా ఉంచుకొంటున్నారు? ఈ ప్రభువుని ఎంతగా నమ్ముకొంటున్నారు అనేది ప్రాముఖ్యము.

పరీక్షాకాలం అనేది ప్రభువును నమ్ముకొన్న వాళ్లకి సహితం వస్తుంది. రాతినేలను పడిన విత్తనం ఫలించిందికాని పరీక్షలు, శ్రమలు వచ్చినప్పుడు మరియు కులం, గోత్రం, ఊరు, వాడ కోడైకూస్తూ మతంలోనికి పోయాడు, మతం మార్చుకున్నాడు అని ఎద్దేవాచేస్తూ, నిందలు వేస్తుంటే ఆ అవహేళన తట్టుకోలేక, విశ్వాసానికి వచ్చిన ఇటువంటి పరీక్షల్లో నిలదొక్కుకోలేక బలహీనపడి, ఓడిపోయినవాళ్లలో నాటుకున్న సువార్త విత్తనం ఎండిపోయి న చందాన వాళ్లు వెనుతిరిగి పోతున్నారు. మీరు ఆ కోవకు చెందియున్నారా? రాతినేలను పడిన విత్తనం పరీక్షకాలం వచ్చినప్పుడు ఫలించకుండా ఎండతగిలి ఎలా ఎండిపోయిందో అలాగే ఈ సువార్త సందేశాలు మీలో ఫలించకుండా పోతున్నాయా? ఒకింత పరిశీలన చేసుకోండి.

**మూడవ రకపు నేల - 'ముండ్లపొదల మధ్య' :-** ఇక్కడ మట్టి ఉంది. అనగా, సువార్త వింటున్నారు, విశ్వసిస్తున్నారు కాని కాలగమనాన కలుపు మొక్కలవలే - ఐహిక విచారములు, జీవన సంబంధమైన ధన భోగములు ఇవన్నీ వచ్చి ముళ్లపొదలు, కలుపు

మొక్కలు లాగ వారిపై అధికమైన ప్రభావాన్ని చూపించడం వలన, విని విశ్వసించిన ఈ ప్రభువైన యేసు సువార్త వారిలో ఎదగడంలేదు, ఫలించకుండా పోతూఉంది. చర్చిలకు, సభలు, సమావేశాలకు వేలాదిగా వెళుతున్నారు, చందాలు, కానుకలిస్తుంటారు. అన్నీ బాగానేఉన్నాయి కాని ఆధ్యాత్మికంగా మరుగుజ్జుల్లా ఉండిపోతున్నారు. సువార్త విని విశ్వసించిన వాళ్లలో ఈ సువార్త ఫలించకుండాపోవడానికి మరొక హేతువేమిటంటే - వీళ్లు స్వస్థతలను ఆశించి, ఆర్థికపరమైన అప్పులు తీర్చుకోవడానికి, కుటుంబ సమస్యల నుండి విడుదలకొరకు వస్తున్నారు. రావటము మంచిదే, తప్పుకాదు కాని ఏటెల్లకాలం ఈ ప్రభువుని భౌతికమైన అవసరాలకి పరిమితం చేయడం వల్ల వారిలో భక్తి విశ్వాసములు కొరవడినందున ఆత్మీయంగా ఎదుగుదల లేక కాలగమనాన ఈ విత్తనం ఎదగకుండా పోయింది. మీ ఆధ్యాత్మిక అనుభవం ఎలాఉంది? పరిశీలన చేసుకుంటే తెలుస్తుందికదా.

**నాలుగవ రకపు నేల - 'మంచి నేల' :-** సువార్త (విత్తనం) విన్నారు (పడింది), విశ్వసించారు, జీవితాన్ని యోగ్యంగా దిద్దుకున్నారు, పాపాలను గుర్తించారు, పశ్చాత్తాపంతో ఒప్పుకున్నారు. పాపక్షమాపణ, ఆత్మరక్షణ పొందారు. దేవునిసన్నిధికి వచ్చినప్పుడు వాళ్లుకూడ స్వస్థత నిమిత్తమై లేదా ఆర్థిక ఇబ్బందులు, వ్యాపారంలో నష్టాలు, ఉద్యోగములో చిక్కులు వల్ల ప్రభువును నమ్ముకొంటే మేలుకలుగుతుందని ఆశించి వచ్చారు, ప్రభువు యొక్క అనుగ్రహము పొందారు. కాని అంతటితో వారి భక్తి ఆగిపోలేదు. వాళ్లు కలిగియున్న విశ్వాసము భౌతికమైన అవసరాలు తీర్చుకోవడానికి మాత్రమే పరిమితం చేయకుండా, దేవుని వాక్యమును (ఈవిత్తనాన్ని) ఎడతెగక వింటున్నారు (పోషణచేస్తున్నారు). కాల గమనాన వాళ్ల జీవితాలను మెరుగుపరుచుకొంటూ వచ్చారు. దేవునితో గల సత్సంబంధం, సహవాసములో, ప్రార్థనా జీవితంలో, నిష్ఠ నియమంతో, దీక్ష దక్షతలతో ప్రభువును సేవిస్తూ వారి జీవితాలలో ఎదుగుతున్నారు. అటువంటి వాళ్లవల్ల దేవునికి మహిమ, అనేకులకు దీవెన కలుగుతుంది.

ఐహికవిచారాలు, ధనభోగాలు, జీవనసంబంధమైన చింతలు వాళ్లకీ ఎదురౌతున్నాయి. గాని, ఇవేమీ వారు ప్రభువైన యేసును సేవించడానికి అవరోధంగా ఎంచుకోకుండా జాగ్రత్తపడుతున్నారు. ఆత్మీయంగా ఎదగని వ్యక్తుల ప్రభావము వీళ్లమీద పడకుండా పటిష్టంగా దేవుని వాక్కులు, సూత్రాలచేత వారి జీవితాన్ని బలంగా కట్టుకొంటున్నారు. అందుచేతనే ఎన్ని పెనుగాలులు లాంటి పరిస్థితులు జీవితంమీద కొట్టినప్పటికిని నిబ్బరం, నిగ్రహముతో నిలబడుతున్నారు. అట్టివారే... మంచినేలను పడి ముప్పదంతలుగా, అరువ దంతలుగా, నూరంతలుగా ఫలించే విత్తనంలాంటి వాళ్లు.

జీవితబాటలో ఎన్నో ఎత్తులు, పల్లాలున్నాయి. కొండలు ఎక్కాలి, లోయలు దాటాలి. కొండలు ఎక్కడము ఆయాసమే, లోయలు దిగడము ఆందోళనే! ఆయాసాలు, ఆందోళనల మధ్యలో మీజీవితం ఎలాసాగుతోంది? దేవునియెడల, మీ సంఘము, దైవదాసుల యెడల, దేవుని వాక్యము యెడల మీ భావాలు ఎలా ఉంటున్నాయి? ఆధ్యాత్మిక భావపరిపక్వత లోనికి మీరు ఎంత ఎదుగుతున్నారు? ఒకసారి పరిశీలన చేసుకోవాలి. ముఖ్యంగా దైవ

సేవకులు ఆత్మీయ ఎదుగుదల స్థాయిని బట్టే సంఘంలో ఉన్న విశ్వాసులను నడిపించ గలుగుతారు. అలాకాకుండా ఎంతసేపూ స్వస్థతలు, ప్రవచనాలమీద సంఘాన్ని కట్టాలను కుంటే అది ఎంతకాలం నిలబడుతుంది? పరిశుద్ధ లేఖనాలలో ఉన్న దైవిక సూత్రాలను మీరు నేర్పించినట్లయితే మీ సంఘాలలో ప్రజలు నైతికంగాను, ఆత్మసంబంధమైన సంగతుల విషయములో మరింత బలోపేతమై దేవునికి మహిమతెచ్చే గొప్పవాళ్లవుతారు. మీ ఆత్మసంబంధమైన ఎదుగుదలలో మీరు ఏ దశలో ఉన్నారు? పసివాళ్లలా ఉన్నారా? లేదా యుక్తవయస్సుకు వచ్చినవారివలె ఉన్నారా? లేదా పూర్తిగా పరిణతిచెందిన పెద్ద వాళ్లయి నలుగురికి చెప్పగలిగిన స్థాయికి ఎదిగారా? ఆత్మీయ ఎదుగుదలలో మీరు ఎక్కడున్నారో పరిశీలించుకోండి? మీలో విత్తబడిన విత్తనం ముప్పదంతలుగా ఫలిస్తోందా! అరువదంతలుగా ఫలిస్తోందా!! లేక నూరంతలుగా ఫలిస్తోందా!!! బహుగా ఫలసాయానికొచ్చే పంటను పండించగలుగునట్లు మీ హృదయమనే నేలను దేవుడు తన కృపా బాహుళ్యము చేత నింపునుగాక!

**- మరనాత.**


మరనాత విశ్వాస సమాజము సమర్పించు

## మరనాత దర్శనం

ఆధ్యాత్మిక టీ.వీ. కార్యక్రమములు

**కల్వరి ఛానల్‌లో**

Calvary TV

బుధవారం రాత్రి 8 - 8 : 30 గంటల వరకు

శుక్రవారం ఉదయం 6:30 - 7 గంటల వరకు

శనివారం రాత్రి 7 - 7 : 30 గంటల వరకు

**ఆరాధన ఛానల్‌లో**

ఆరాధన ARADHANA

గురువారం ఉదయం 7 - 7 :30 గంటల వరకు

**శుభవార్త ఛానల్‌లో**

SUBHAVAARTHA TELEVISION

సోమవారం మధ్యాహ్నం 1 :30 - 2 వరకు

శుక్రవారం రాత్రి 9:30 - 10 గంటల వరకు

# అభ్యర్ధన - ఆచరణ - ఆశీర్వాదము

ఆయన (యేసు) మీతో చెప్పునది చేయుడి

డా॥ నిరీక్షణ కె. కంచర్ల
M.A., MBA., M.A., M.Div., M.Th., D.Min., (Ph.D.)
డైరెక్టర్ - మరనాత థియోలాజికల్ సెమినరీ
హైదరాబాదు. సెల్ : 9849746464

## ముట్టడి లో షోమ్రోను

అందరికి శుభములు.

భక్తంటే, భక్తులు దేవుని సమీపించి ప్రార్థించటము మాత్రమే కాదని, ప్రార్ధనతోపాటు దైవాజ్ఞలను పాటించటం ద్వారా సంపూర్ణ విజయాలు పొందగలమని పరిశుద్ధ లేఖనముల వెలుగులో పరిశీలిస్తున్నాము.

యెహోరాము ఇశ్రాయేలు దేశమును 12 సంవత్సరములు (క్రీ.పూ. 852-840) పాలించాడు (2 రాజులు 3 : 1). ఇతని పాలన ఎప్పుడూ అవకతవకలతో సాగింది. కారణం, అతడు దేవుని నమ్మకంగా సేవించినవాడు కాదు. తనకు తోచినట్లుగా భక్తిచేస్తూ, భక్తి సూత్రాలను అధిగమించి అవసరానికే దేవుని వాడుకొని తరువాత విసర్జించినవాడు. అయితే దైవజనుడైన ఎలీషా అతనికి తోడుగా ఉండి పరిస్థితులను చక్కదిద్దేవాడు. 2 రాజులు 6వ అధ్యాయంలో సిరియా రాజైన బెన్హదదు కుట్రను వమ్ముచేసి, వారి కళ్ళు తెరిపించి ఇరు దేశాలు కొంతకాలం ప్రశాంత పాలనలను జరిగించుకోవటానికి మార్గము సుగమం చేశాడు. కుక్కతోక వంకరన్నట్లు కొంతకాలమైన తరువాత సిరియా రాజైన బెన్హదదు-2 తిరిగి షోమ్రోను ముట్టడించాడు. ఈసారి అతడు అత్యంత కఠినముగా ఇశ్రాయేలీయులను నిర్భందించాడు (2 రాజులు 6 : 24-30). ఇది ఇశ్రాయేలు ప్రజల చరిత్రలో అత్యంత దయనీయమైన సంఘటనగా చరిత్రలో లిఖించబడింది.

సిరియా సైన్యము ముట్టడి కారణంగా, ఇశ్రాయేలు దేశంలోకి రాకపోకలు, రవాణా పూర్తిగా స్తంభించిపోయాయి. దేశంలోపల ఉన్న ధాన్యాగారాలు కొద్దిరోజుల్లోనే ఖాళీ అయిపోయాయి. బయటనుండి ఆహారధాన్యాలు తెచ్చుకునే పరిస్థితి లేదు. దేశం లోపల ఆహార నిల్వలూ లేవు. ప్రజలు ఆకలితో అలమటించే పరిస్థితి. ఇప్పుడు ఇశ్రాయేలు దేశం ఆకలి కేకలతో, దుర్భర క్షామంలో పెద్దలు, పిన్నలు, పశువులు, పక్షులు మలమల మాడిపోతున్నారు. అన్నీ ఉన్నప్పుడు ఆహారం విలువ, ఆరోగ్యం విలువ, సమయం విలువ గుర్తించటం చాలా మందికి కష్టం. ఎక్కడో కొంతమంది దైవజ్ఞానంతో దేవుడిచ్చిన వనరులను విధేయతతో వినియోగిస్తారు. చాలామంది చులకనచేసి, వాటిని పోగొట్టుకొని నిర్వీర్యమౌతారు. దేవుని భయం లేకుండా, ధర్మశాస్త్ర నియమనిబంధనలను, యాజకులను

చులకనచేసి, పనికిరాని స్వార్థప్రయోజన భక్తిని చేసి చేతులారా కొనితెచ్చుకొన్న సమస్య యిది. 2 రాజులు 6 : 25 - "షోమ్రోనులో గొప్ప క్షామము కలిగియుండగా గాడిద యొక్క తల ఎనుబది రూపాయలకును, అర పావురపు రెట్ట అయిదు రూపాయలకును అమ్మబడెను; వారు అంత కఠినముగా ముట్టడి వేసియుండిరి". ఆంగ్లములో ఆయా తర్జుమాలలో పైవచనములో 'రూపాయి' అని తర్జుమా చేయబడిన సందర్భాన్ని వెండి షెకెల్స్‌గా అనువదించారు. అంటే గాడిదయొక్క తల 80 వెండి షెకెల్స్, మరియు అరపావురపు రెట్ట 5 వెండి షెకెల్స్. అంటే ప్రస్తుతము ఇశ్రాయేలు దేశములో చెలామణిలో ఉన్న కరెన్సీ షెకెలు. షెకెలు ద్రవ్య విలువ ఆయా కాలాలలో హెచ్చుతగ్గులుగా ఉన్నప్పటికి, ఒక ప్రత్యేక గుర్తింపు పొందినది. ప్రస్తుతము ఇశ్రాయేలు దేశపు షెకెలు మన 19 రూపాయలతో సమానము. అంటే షోమ్రోను ముట్టడిలో ఇశ్రాయేలీ యులు ఉన్నప్పుడు గాడిద తలను 80×19=1,520/-(ప్రస్తుత విలువ), మరియు అర పావురపురెట్ట 5×19=95 గా అమ్మబడ్డాయి. అంటే కరువెంత భారంగా, కష్టంగా ఉందో కొంతవరకు గ్రహించవచ్చు. సగటు ఇశ్రాయేలీయుడు గాడిద తలను అంతగా యిష్టపడి ఆహారంగా తీసుకోరు. ఇంకొక విచిత్రమేమిటంటే పావురపు రెట్టను ఆహారంగా తీసుకోవటం. ఈ సంగతిని జాగ్రత్తగా పరిశీలిస్తే పక్షుల రెట్టలలో జీర్ణముగాని గింజలుంటాయి. తద్వారా వాటి విసర్జనము వలన ఆయా స్థలాలలో మొక్కలు ఉత్పత్తి అవ్వటం గమనార్హం. అలాగే పావురపు రెట్టలో జీర్ణముగాని గింజల సంఖ్య ఎక్కువ, కనుక, ఆ గింజలతో ఆకలి తీర్చుకోవటానికి ఆనాటి ప్రజలు తాపత్రయపడ్డారు. అంటే పరిస్థితులు ఎంత క్లిష్టంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. అశుద్ధం నుంచి సేకరించిన, జీర్ణంగాని గింజలను ఆకలి తీర్చుకోవటానికి వినియోగించిన విధము నిజంగా వారి కష్టకాలాన్ని తెలియచేస్తోంది. గనుక ఆహారమును, నీటిని వృధాచేయక భక్తిశ్రద్ధలతో వినియోగించాలి. అవి లేనివారికి వాటి విలువ తెలుసు.

ప్రస్తుతము ప్రపంచ వ్యాప్తంగా ఆకలి కేకలు వినబడుతున్నాయి. ప్రతి 9 మందిలో ఒకరికి తిండి కరువు. ప్రపంచవ్యాప్తంగా ఈ బాధితులు పెరుగుతున్నారు. కారణం విపత్కర వాతావరణ పరిస్థితులే. పేద, వర్ధమాన దేశాల్లో కరువు తీవ్ర ప్రభావం చూపిస్తోందని ఐక్య రాజ్యసమితి ఈ మధ్యే వెల్లడించింది. గత మూడేళ్ళలో తిండిలేనివారి సంఖ్య క్రమేపి పెరుగుతోంది. 2017 లో ప్రపంచవ్యాప్తంగా 82.1 కోట్లమంది సరైన పోషకాహారం అందక ఆనారోగ్యాలపాలయ్యారు. అంటె ప్రపంచ జనాభాలో ప్రతి తొమ్మిది మందిలో ఒకరు ఆకలితో అలమటిస్తున్నారు. భారత్‌లోనూ ఈ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి. 130 కోట్లకు పైగా జనాభాగల భారత్ రెండు దశాబ్దాలుగా ఆర్థిక పథంలో మందడుగేస్తోంది. ఆదే సమయంలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. వృద్ధి రేటు, తలసరి ఆదాయాల పరిస్థితి బాగున్నా, ఆహారధాన్యాల ఉత్పత్తి రెట్టింపైనా, దేశ జనాభాకు సరిపడా తిండిగింజలను అన్నదాతలు ఉత్పత్తి చేయలేకపోతున్నారు. దేశ జనాభాలో 14.5 శాతానికి పౌష్టికాహారం అందటంలేదు. రోజుకు 19.7 కోట్లమంది తిండిలేక పస్తులుంటున్నారు. అంతేకాదు ఆహారం దొరకనందున నిత్యం 3000 మంది చిన్నారులు మృత్యువాత పడుతున్నారని, వారిలో

24 శాతం అయిదేళ్ళలోపువారే అని ఐరాస (ఐక్యరాజ్యసమితి) 2017 లో తెలియచేసింది. ప్రస్తుతం ప్రపంచ ఆహార సూచికలో భారత్ 31.4 గా ఉంది. ఇది 28.5 కు దిగజారితే అత్యంత ఆందోళనకరమైన పరిస్థితిగా పరిగణిస్తారు. ఇవి ఆకలికేకలకు నిదర్శనాలు..!!

ఆనాటి ఇశ్రాయేలు దేశపు రాజైన యెహోరాము ఏలుబడిలో మనం ప్రస్తావించిన వాటిని మించిన గడ్డుపరిస్థితులు ఏర్పడ్డాయి. అందుకే ఏది దొరికితే దానిని, ఎంత వెలనైనా వెచ్చించి కొనే పరిస్థితులు దాపురించాయి. దేవునికి అవిధేయులైనందున మరియు యెహోరాము స్థిరముగా దేవుని వెంబడించనందున ఇలాంటి కష్టపరిస్థితులు వారెదుర్కొన వలసి వచ్చింది.

పరిస్థితులు మరింత విషమించాయి... "ఇశ్రాయేలురాజు (యెహోరాము) పట్టణపు ప్రాకారముల మీద సంచారము చేయుచుండగా (పూర్వము పట్టణాలచుట్టూ ప్రహరీగోడలు కట్టుకునేవారు. తద్వారా శత్రువులనుండి తమ్మును తాము కాపాడుకోవటం కొంతవరకు సాధ్యమయ్యేది) ఒక స్త్రీ రాజును చూచి... సహాయము చేయుమని కేకలువేయుట విని- యెహోవా నీకు సహాయము చేయనిది నేనెక్కడనుండి నీకు సహాయము చేయుదును?... నీ విచారమునకు కారణమేమని అడుగగా... ఈ స్త్రీ నన్నుచూచి నేటి ఆహారమునకు నీ బిడ్డను ఇమ్ము. రేపు మనము నా బిడ్డను భక్షించుదము... మేము నా బిడ్డను వంటచేసుకొని తింటిమి. అయితే మరునాటి యందు... నేటి ఆహారమునకు నీ బిడ్డను ఇమ్మని అడిగితిని గాని అది తన బిడ్డను దాచిపెట్టెనని చెప్పెను" (2 రాజులు 6 : 26-29). ఇది ఎంతటి విషాద ఘట్టము. 30వ వచనం - రాజు ఈ మాటలు విని తన వస్త్రములను చింపుకొని ప్రాకారముల మీద నడచిపోయెను. ఇది ఊహకు అందని కష్టము. ఇది ఎంత విషాదమో... అవిధేయులై, దేవుని విడిచినవారు, తమంతట తాము తెచ్చుకున్న విపరీత శిక్ష. దైవ సూచనలకు అవిధేయులైన వారికి దాపురించే కష్టాలు ఎలా ఉంటాయో ద్వితి. 28 : 15-68 వచనములలో బహు వివరముగా తెలియచేయటమైనది. అందులో 52,53 వచనాలలో - "... నీ దేశమందంతటను నీ గ్రామములన్నిటిలోనూ నిన్ను ముట్టడి వేయుదురు. అప్పుడు ముట్టడిలోను నీ శత్రువులు నిన్ను పట్టి ఇబ్బందిలోను, నీ గర్భఫలము ను ... నీకిచ్చిన నీ కుమారులయొక్కయు నీ కుమార్తెలయొక్కయు మాంసము తిందువు". ఊహించని అతిపెద్ద కష్టము వారికి దాపురించటానికి ప్రధాన కారణం స్వయంకృతాప రాధము. ఇలాంటివారిని కాపాడటం ఎవరి తరమూ కాదు. వారి పనులు, మాటలు ఎల్లప్పుడు చెడ్డగా ఉంటూ అనవసర దురహంకార పోకడలను కనుపరుస్తూ, తమ్మును తామే ఘనపర్చుకుంటూ ఆదోరకమైన వెర్రి వేషధారణతో కూడిన భక్తిలో కొనసాగుతారు. వారివలన యితరులకు ఏవిధమైన ప్రయోజనము లేకపోగా తమకు కూడా ప్రయోజనం చేకూర్చుకోలేనివారౌతారు. కనుక ప్రతివారు దేవునికి భయపడి శరీరమును అదుపులో ఉంచుకుని దైవాజ్ఞలను పాటిస్తూ, దేవుడనుగ్రహించే దీవెనలు పొందుకోవాలి, తరువాత తరాలకు అందించాలి.

ఇలాంటి దయనీయ పరిస్థితులలో ఇశ్రాయేలు రాజు ఓ సత్యాన్ని ప్రపంచానికి చెప్పకనే చెప్పాడు. 2 రాజులు 6 : 27 - "యెహోవా సహాయము చేయనిది నేనెక్కడనుండి నీకు సహాయము చేయుదును?... " నిజమే సహాయం చెయ్యాలని ఆశించినా, అందుకు అనుగుణమైన వాతావరణముండాలి గదా! సంక్లిష్ట సందర్భాలలో దేవుడే సహాయం చెయ్యాలి. అదే సత్యము. కీర్తనలు 118 : 8,9 - "మనుష్యులను నమ్ముకొనుట కంటె యెహోవాను ఆశ్రయించుట మేలు". కీర్తనలు 146 : 34 - "రాజులచేతనైనను నరులచేతనైనను రక్షణ కలుగదు. వారిని నమ్ముకొనకుడి... వారు మంటిపాలగుదురు". యిర్మియా 17 : 5 - "యెహోవా ఈలాగు... నరులను ఆశ్రయించి శరీరులను తనకాధారముగా చేసికొనుచు తన హృదయ మును యెహోవానుండి తొలగించుకొనువాడు శాపగ్రస్తుడు".

పై వచనములను బహుజాగ్రత్తగా పరిశీలించి అర్థంచేసుకోవాలి. తోటి మనుష్యులతో, పెద్దలతో పనిలేదు అంతా దేవుడే చేస్తాడని కాదు. కార్యములు చేసేది దేవుడే, అయితే ఆ దేవుని సహాయం మనుష్యులద్వారానే మనకందుతుంది. అందరిని దూరంచేసుకుంటూ, సఖ్యతను కాపాడుకోకుండా, మాకెవ్వరితోనూ పనిలేదన్నట్లు వ్యవహరించేవారు మామూలుగాను, ఆధ్యాత్మికంగాను బహు అమాయకులు. తోటివారితో (అందరితో కాకపోయినా) సత్సంబంధాలు కనీసమాత్రము లేకుండా దేవునితో నేరుగా మాట్లాడుతున్నామనే వారిని మించిన అబద్ధీకులు లేరు..!!! ?? అంతగా దేవునితో మాట్లాడుతూ, దేవుడు వారితో మాట్లాడే టప్పుడు.. అట్టివారికి కనీస ధర్మాలు తెలియదా? లేక ఆధ్యాత్మిక అహంభావమా..?? ఆలోచించాలి.. నాయిష్టం వచ్చినట్లు భక్తి చేస్తానంటే కుదరదు. బైబిలు భక్తి చెయ్యాలి. అదే నిజమైన భక్తి. రాజులైనా, మరెవ్వరైనా తోటివారికి సహాయం చెయ్యాలని ఆశించినా, అది వారిపరిధికి మించినందున, సహాయం చేయలేని స్థితిని ఆ లేఖనాలు సూచిస్తున్నాయేగాని, ఎవ్వరిని నమ్ముద్దు, ఎవ్వరు సహాయం చెయ్యరని కాదు భావం. సహాయం చెయ్యలేని స్థితిలో వారుండగా వారిని ఆశ్రయించటం వ్యర్థం, అలాంటప్పుడు దేవుడే సహాయం చేస్తాడని ఆ లేఖనాలను అర్థంచేసుకోవాలి.

అందుకే యెహోరాము ఈసమయంలో దేవుడే సహాయం చెయ్యాలన్నాడు. ఆ దేవుడు మనుష్యుల ద్వారానే సహాయం చేస్తాడు గాని డబ్బుల మూటలు మనయిళ్ళల్లో పడెయ్యడు గదా..!!?? అందుకే పరస్పర గౌరవ భావముతో తోటివారితో మెలగాలి. అందరిని శంకిస్తూ, స్వల్ప కారణాలతో ప్రజలకు దూరమవ్వటం, దూరం చేసుకోవటం అంత మంచిది కాదు. చిన్నచిన్న కారణాలను భూతద్దంలో చూస్తూ పదేపదే అనవసర విశ్లేషణలు జరిగించేవారు సహజంగా ఏకాకులుగానే ఉంటారు. వారి భక్తి వారికి ఏవిధంగానూ అక్కరకు రాదు.

రాజుగారికి కోపమొచ్చింది. ఉరుము ఉరిమి మంగళంమీద పడ్డట్టు దైవజనుడైన ఎలీషామీద పడ్డాడు. అందరికి తేరగా దొరికినవాడు, అందరి ఆవేశాలను చల్లార్చుకోవటానికి అందుబాటులో ఉండి అనిపించుకొనేవారు దైవసేవకులే కదా..!! భరించేవాడు కనుకనే దేవుడు కూడా అట్టి బాధ్యతను అప్పగించాడనుకోవాలి..?!!. 2 రాజులు 6 : 31- "తరువాత

రాజు - షాపాతు కుమారుడైన ఎలీషాయొక్క తల ఈదినమున అతనిపై నిలిచియున్న యెడల..." అంటే ఆ యిబ్బంది రావటానికి కారణం ఎలీషా..?? అంతకు ముందు ఎలీషా సేవలద్వారా ఇశ్రాయేలు, సిరియా దేశాల సరిహద్దులలో గొప్ప నెమ్మది కలిగింది. అప్పుడు యెహోరాము ఎలీషాను సత్కరించినట్లు చూడం. 2 రాజులు 6 : 23 - అయితే కష్టంవచ్చినప్పుడు ప్రార్థించమని దైవజనుని కోరటంమాని తల తీయిస్తానని రాజు మాట్లాడటం విడ్డూరం. మేలు జరిగితేనేమో వాళ్ళ ప్రార్థనాఫలం. ఏదైనా జరగరానిది జరిగితే సంఘము, సంఘకాపరి బాధ్యులు..??!! ఇదొక విచిత్రము.

దైవజనుడైన ఎలీషా ఆసంగతిని ముందుగానే గ్రహించాడు. 2 రాజులు 6 : 32 - ఎలీషా రాజును సమీపించాడు. 2 రాజులు 7 : 1-2 - "యెహోవా మాట ఆలకింపుము... రేపు ఈ వేళకు షోమ్రోను ద్వారమందు రూపాయి ఒకటింటికి ఒక మానిక సన్నని పిండియు, రూపాయి ఒకటింటికి రెండు మానికల యవలును అమ్మబడును... ఎవరి చేతిమీద రాజు ఆనుకొనియుండునో ఆ యధిపతి.. ఆకాశమందు కిటికీలు తెరచినను.. చూచెదవు గాని దాని తినకుందువు...".

మొత్తానికి వ్యవహారం ఎలీషా దగ్గరకొచ్చింది. అంతకు ముందే రాజు ఎలీషాను సంప్రదిస్తే బాగుండేది. విలువైన మనుష్యులను గుర్తించి, వారిని వినియోగించుకోవటం విజ్ఞుల విజ్ఞానానికి నిదర్శనం. దేవుడు చెప్పిన మాటను ఎలీషా చెప్పాడు. వారిని రేపటివరకు ఆగమన్నాడు. ఆలాచేస్తేనే అద్భుతం జరుగుతుందని నిష్కర్షగా తెలియచేశాడు. అందరూ విన్నారు, విశ్వసించారు, ఆచరించారు ఒక్కడు తప్ప. అతడు కీలకమైన మనిషి, రాజుగారికి బహు సన్నిహితుడు. కొన్ని విషయాలలో గొప్పవాడేగాని, దేవుని సంగతులు గ్రహించటంలో చిన్నవాడు. అందరూ మౌనంగా వారి అభ్యర్థనకు దేవుడు ఎలీషా ద్వారా పంపించిన సందేశం భక్తి శ్రద్ధలతో వింటూఉంటే, ఆ అధిపతి అనవసరంగా జోక్యంచేసుకొని యెహోవా ఆకాశమందు కిటికీలు తెరచిననూ అలాగు జరుగునా అని అన్నాడు. వెంటనే ఎలీషా ఆ అద్భుతాన్ని నువ్వు చూస్తావు గాని దాని తినకుందువన్నాడు. నోటిదాకా వచ్చిన కూడు దూరమయ్యింది. చాలామంది ఈరోజుల్లో పిచ్చిమాటలు, ఆలోచనలు, వ్యర్థమైన దురహంకారపు ధోరణులవల్ల దీవెనలను చేతులారా పోగొట్టుకుంటున్నారు. దీవెనలను చూస్తున్నారు గాని అనుభవించటంలేదు. ఎప్పుడుచూచినా నిర్వేదంలో జీవిస్తున్నారు. కారణం వారి కీడు కలిగించే మాటలు, వారికి, కుటుంబానికి, సేవలకు తీవ్రనష్టం, కష్టం కలిగిస్తున్నాయి.

దైవజనుడు చెప్పినట్లు మాటువేసిన సిరియన్లు వారంతట వారే పారిపోయారు. వారికొరకు సిద్ధం చేసుకున్న ఆహారం, దైవప్రణాళికలో నెరవేర్చబడి ఇశ్రాయేలు ప్రజలకు అందింది (2 రాజులు 7 : 3-18; 19-20). దేవుని ఆశీర్వాదం అందరికి అందినది. అయితే ఆ అధిపతి ఆశీర్వాదాన్ని, ఆహారాన్ని చూచాడు గాని దానిని అనుభవించలేక ద్వారమందు జనుల వత్తిడిచేత త్రొక్కబడి మరణించాడు. సంక్లిష్ట సమయంలో దేవుని సూచనలను పాటించి, విశ్వసించి దైవసహాయం పొందుదాం. **( సశేషం )**

# ప్రమాదపు అంచుల్లో

**సహోదరి ఎ. ఉషారాణి, అధ్యాపకురాలు, మరనాత బిబ్లికల్ సెమినరి, విజయవాడ**

మరనాత మెసేంజర్ పాఠకులకు ప్రభువైన క్రీస్తు నామమున శుభములు. ఆధునికత, విజ్ఞానశాస్త్రముల ఎదుగుదలతో ప్రపంచం దూసుకెళ్తుంది. విద్యా, వైద్య ప్రమాణాలు వృద్ధిచెందుతున్నప్పటికీ మానవ మనుగడ విధానంలో చిన్న మార్పులు జరుగుతున్నప్పటికీ ఏదో ఒక చిన్న విషయానికి, సంగతికి బానిస అవుతూనే ఉన్నాడు. తద్వారా సమాజములో సాధించవలసినంత అభివృద్ధి చూడలేకపోతున్నారు. బానిసత్వం అనే మాటను అధ్యయనం చేయవలసి వస్తే, బైబిలు గ్రంథములో మనకు ఇశ్రాయేలీయుల బానిసత్వం గుర్తుకొస్తుంది. దేవుని ప్రజగా, దేవునిచేత ఎంపిక చేయబడిన దైవజనాంగం యొక్క చరిత్రలో ఎటువంటి బానిసత్వం ఎందుకు ఎదుర్కొనవలసి వచ్చిందో చాలామందికి అవగాహన లేనందువలన వారి జీవితాలలో కూడా విడుదలను పొందలేకపోతున్నారు. ప్రమాదపు అంచులలో ప్రయాణించిన ఇశ్రాయేలీయుల చరిత్రను గూర్చి పరిశుద్ధ లేఖనాలనుండి ఒక్కింత అధ్యయనం చేద్దాం.

“దేవుడు - నీ సంతతివారు తమదికాని పరదేశమందు నివశించి ఆ దేశపువారికి దాసులుగా నుందురు. వారు 400 యేండ్లు వారిని శ్రమపెట్టుదురు. వీరు ఎవరికి దాసులవుదురో ఆ జనమునకు నేనే తీర్పు తీర్చుదును. తరువాత వారు మిక్కిలి ఆస్థితో బయలుదేరివచ్చెదరు.

పైన చెప్పబడిన వచనాలను పరిశీలన చేస్తే దేవుడు అబ్రహాముతో నిబంధన చేస్తున్న సందర్భం. ఈ నిబంధనలో దేవుడే తన ప్రజలకు వాగ్దానభూమిని యిస్తున్నట్లుగా స్పష్టంగా తెలుస్తుంది. అయితే మనం గమనించవలసిన ఒక్క మాట ఉంది. అదేమనగా, నీ సంతతి వారు నాలుగు వందల సంవత్సరాలు తమదికాని దేశంలో బానిసలుగా ఉంటారని చెప్పాడు. వాగ్ధాన భూమిని పొందుకుంటానని ఆనందించాలో, తన సంతతివారు బానిసలుగా బ్రదుకు తారని దుఃఖపడాలో అబ్రహాముకు అర్థంకాలేదని చెప్పవచ్చు. వాగ్ధాన భూమిని గూర్చిన దీవెనలు, ఆశీర్వాదాలు నిండారులుగా పొందుకోవలసిన సమయంలో ఒక విచిత్రమైన, విభిన్నమైన మాట అబ్రహాముకు వినపడింది. ఈ మాటను అనగా, తన సంతతి బానిసత్వంలో ఉండునని చెప్పిన మాట అబ్రహాం ఎంత అర్థంచేసుకున్నాడో తెలియనిదికాదు. ఈనాడు దైవలేఖనాలు పఠిస్తున్నా దీనిని సంపూర్ణంగా అర్థంచేసుకోలేకపోతున్నారన్నది వాస్తవం. దేవుడు ఏ మాటని ఉచితంగా వదిలివేయడు అంటే అర్థం పర్థం లేకుండా ఎప్పుడూ మాట్లాడడు. దేవుడు సెలవిచ్చే మాటకు ఒక అంతరార్థం దాగిఉంటుంది. ఆ అంతరార్థం తెలిస్తేనే అందున్న దీవెనను, ఎదుర్కొనబోయే ప్రమాదాన్ని సునాయాసంగా తప్పించుకోగలం. ఇక్కడ నాకొక ప్రశ్న ఏమంటే - దేవుడు ముందుగా చెప్పాడు గనుకనే ఇశ్రాయేలీయులు బానిసత్వంలోకి వెళ్ళారా? లేక ఇశ్రాయేలీయులు బానిసత్వంలోకి వెళతారని ముందుగా

ఎరిగిన దేవుడు అబ్రహాముకు చెప్పాడా? ఈనాడు చాలామంది దేవుడు చెప్పాడు కాబట్టి నెరవేరింది అనే నమ్ముతున్నారు. అలా నమ్మటం తప్పని నేను అనడంలేదు కాని తెలుసుకోవలసిన కొన్ని సంగతులు మర్చిపోతున్నారనేది వాస్తవం. అయిన, ఇక్కడ ఒక మాట చెప్పాలనిపిస్తుంది. తండ్రియైన దేవుడు, తన ప్రజలైన ఇశ్రాయేలీయులను తెలిసి తెలిసి బానిసత్వంలోకి ఎందుకు పంపిస్తాడు? సహజంగా మనుష్యులు కూడా అలా చెయ్యరు కదా. మనుష్యులు చెడ్డవారైనప్పటికి తమ పిల్లలకు మంచి యీవులను ఇవ్వాలని కోరుకుంటారు కదా (మత్తయి 7 : 11). పై మాటలను అపార్థం చేసుకోకుండా, లోతుల్లోకి వెళ్ళి పరిశీలన చేస్తే ఇశ్రాయేలీయుల బానిసత్వం వెనుక ఏవో సత్యాలు దాగిఉన్నాయి. ఆ కారణాలే వారిని ప్రమాదపు అంచుల్లోకి నెట్టివేసాయి. ఆకారణాలను లేఖనాల వెలుగులోనే ఒక్కింత పరిశీలన చేద్దాం.

**A) ప్రయాణము (ఆది 46 : 4) :-** "ఆయన - నేనే దేవుడను; నీ తండ్రి దేవుడను, ఐగుప్తునకు వెళ్ళుటకు భయపడకుము, అక్కడ నిన్ను గొప్పజనముగా చేసెదను. నేను ఐగుప్తునకు నీతోకూడ వచ్చెదను, అంతేకాదు నేను నిశ్చయముగా నిన్ను తిరిగి తీసికొనివచ్చెదను" అని యాకోబుకు వాగ్దానం చేసెను.

యాకోబు తనకు కలిగిన పండ్రెండుగురు కుమారులలో యోసేపును బహుగా ప్రేమించాడు. యోసేపుకు తల్లి లేనందువలన యాకోబు తానే తల్లిగా, తండ్రిగా పాత్రను పోషించాడు. ఈ ప్రేమను మిగిలిన కుమారులు తప్పుగా అర్థం చేసుకున్నారు. అందువలనే అన్నలందరు యోసేపుమీద పగపట్టారు. ఆ పగ ఎంతకు దారితీసిందంటే, విచక్షణా రాహిత్యంగా మానవతా విలువలను మంటకలుపుతు సొంత సోదరుణ్ణి గోతిలోకి త్రోసి, పరులకు బానిసగా అమ్మివేశారు. ఒకరి ప్రేమ, మరొకరికి శాపమవుతుందనటానికి ఇదియే ఉదాహరణ. ఒక్క అర్థరాహిత్యమైన ఆలోచన ఆవేశానికి, ఆ ఆవేశం అనర్థానికి దారితీసింది. తద్వారా యాకోబుకు తీరని శోకం మిగిల్చింది. అక్కడతో కథ ఆగిపోయిఉంటే ఎలాగు ఉండేదో. కాని, ఏ కథ సుఖాంతం కాకుండా దేవుడు వదిలిపెట్టడు. యోసేపు పట్ల ఉన్న ప్రణాళిక ఎంతో గొప్పది. అన్నలు పగతో యోసేపును వదిలించుకోగలరు కాని, యోసేపు పట్ల ఉన్న ప్రణాళికను వదిలించుకోలేరు. అందువలనే, కాలప్రయాణంలో యోసేపు ఐగుప్తు సామ్రాజ్యంలోనే చెప్పుకోదగిన వ్యక్తి కాగలిగితే, అన్నలు మాత్రం అదే జీవితాల్లో చెప్పలేనన్ని దురవస్థలు అనుభవించారు. వారున్న రాజ్యంలో కరువు ఏలుబడి చేస్తున్నందువలన, ఐగుప్తులో ధాన్యం ఉన్నదని ఎరిగి, ఐగుప్తుకు వెళ్ళాలని నిశ్చయించుకున్నారు. ఆనాడు కడుపు మంటతోనే యోసేపును కాదన్నవారు ఈరోజు ఆకలి మంటతో ఐగుప్తుకు వెళ్ళవలసివచ్చింది. ఐగుప్తులో అధికారి యోసేపని విషయం తెలుసుకొన్నపిదప యోసేపు కోరిక మేరకు తన కుటుంబం అంతటిని ఐగుప్తుకు రావలసిందిగా ఆహ్వానించాడు. అన్నలు పగను స్వాగతిస్తే యోసేపు ప్రేమను ఆహ్వానించాడు. ఆ ఆహ్వానము తండ్రియైన యాకోబుకు బహు సంతోషమును, ఊరటను కలిగించింది. ఆహ్వానము యిచ్చారుకదా అని

**( మిగతా 18 వ పేజీలో... )**

# కృతజ్ఞతా భావన

- డా॥ మనష్షే కొటారి, గుంటూరు

## కృతజ్ఞత భావన అంటే - :

మనల్ని ప్రేమించినవారి మీద, ఆదుకున్నవారి మీద, కష్టాలలో, కన్నీళ్లలో మనతో పయనించిన వారిమీద, నిరాశ నిస్పృహలలో మన వెంట నడిచిన వారి మీద, ఈ జీవితానికి అర్థంతెలియక, తెలియచేసేవారు లేక, తెలిసినా ఆచరించలేక అధముడుగా వున్నవేళ, అదఃపాతాళంలో చిక్కుకున్న వేళ, ఆపన్నహస్తం అందించిన వారి మీద మనస్సులో పుట్టే భావన కృతజ్ఞతా భావన. ఇది అనన్యం, అసామాన్యం. ఎలాగైనా తిరిగి వారి ఋణం తీర్చుకోవాలని, వారిని ప్రేమించాలని, ఆదుకోవాలనే భావమే కృతజ్ఞతాభావం. మనిషి స్వతహాగా నటనాజీవి. కొందరు నటనలోనే జీవితాన్ని ముగిస్తారు. మరికొందరు నటనలోనే జీవించి నిజమైన జీవితాన్ని ప్రసాదించిన దేవున్ని మర్చిపోతున్నారు. అందుకే బంధాలలో బలం లేదు, బంధాలు నానాటికి బలహీనమవుతున్నాయి. కానీ నటనలేని నిజమైన జీవితం, జీవం కృతజ్ఞతలో ఉంది. మనిషికి అవసరమైన, అనవసరమైన భావాలు ఉన్నాయి. కానీ కృతజ్ఞతా భావన మానవజాతి మనుగడకు చాలా అవసరమైనది. బాధాకరమైన విషయం ఏమిటంటే మనిషిలో కృతజ్ఞతాభావన అంతరించిపోతుంది. యంత్రాల కంటే యాంత్రికంగా మారిపోయిన నేటి బంధాలలో కృతజ్ఞతా భావన తగ్గిపోతుంది. నేటి సమాజం మరిచిపోతున్న అద్భుతమైన శక్తి కృతజ్ఞతాభావన. కృతజ్ఞత అనేది కేవలం మాటల్లో 'థ్యాంక్యు' అని చెప్పడం మాత్రమే కాదు. నీకు సహాయం చేసినవారికైనా, మరెవరికైనా నువ్వు ఉపయోగపడిన నాడు, ఆదుకున్న నాడు నీ కృతజ్ఞతకు అర్థం పరమార్థం. కృతజ్ఞతా భావన మనిషిని ఎంత గొప్పగా ఆలోచించేలా చేస్తుందో తెలిపే చిన్న సంఘటన.

ఒక రాజకీయ నాయకునివద్ద క్రొత్తగా ఒక డ్రైవర్ ఉద్యోగంలో చేరాడు. కారులో ఐదు లీటర్ల పెట్రోల్ డబ్బా ఉండటం గమనించి, "సార్, ఈ డబ్బా ఎందుకు ఉంచారు? మన కారు పెట్రోల్ ట్యాంక్‌లో పోసెయ్యమంటారా?" అని అడిగాడు. అప్పుడు ఆ రాజకీయ నాయకుడు తన గత అనుభవాన్ని డ్రైవర్‌తో ఇలా పంచుకున్నాడు. "నేను కారు కొనుక్కునే స్థాయికి రాకముందు బైక్ మీద ప్రయాణించేవాడిని. ఒకరోజు మధ్యాహ్నం తీవ్రమైన ఎండ, వడగాలులు వీస్తున్నాయి. అకస్మాత్తుగా బండిలో పెట్రోల్ అయిపోయింది. పెట్రోల్ బంక్ చాలా దూరంలో ఉంది. నీరసంతో బండి దగ్గర చతికిలబడిపోయాను. ఎవ్వరూ పట్టించుకో లేదు. ఇంతలో ఒక వ్యక్తి వచ్చి నా పరిస్థితి గమనించి, వెంటనే తన దగ్గర ఉన్న అరలీటరు మంచినీటి బాటిల్‌తో దగ్గరలో ఉన్న బంక్‌కి వెళ్లి, పెట్రోల్ తెచ్చాడు. నా బండి మీద తిరిగి ప్రయాణం సాగించాను. ఆ సమయంలో నా మనస్సులో అతని మీద కృతజ్ఞతా భావం ఉప్పొంగింది. అప్పుడు నిర్ణయం తీసుకున్నాను. నాతోపాటు చిన్న పెట్రోల్ బాటిల్ ఉంచుకుందామని. అవసరమైనవారికి అవకాశం కల్పించుకొని మరి సాయం చేద్దామని!!".

నిజమే "కృతజ్ఞతా భావన నుండి సేవాభావం ఉదయిస్తుంది. ఆదుకోవాలనే ఆశయానికి పునాది వేస్తుంది". అరలీటర్ పెట్రోల్ సహాయానికే అంత కృతజ్ఞత ఉంటే సకల సృష్టి నిర్మాణకుడైన దేవుడు సృష్టిలోని సంపదను, సృష్టిమీద అధికారం మనకిస్తే ఇంకెంత కృతజ్ఞత కలిగి ఉండాలి? నవమాసాలు మోసి, ప్రాణాలకు తెగించి నీకు జన్మనిచ్చిన తల్లి మీద, సమస్తము సమకూర్చటానికి కష్టపడుతున్న తండ్రిమీద, ఒకే తల్లి కడుపున పుట్టిన తోబుట్టువులమీద, రక్త సంబంధులైన బంధువులమీద, విద్యాదానం చేసిన ఉపాధ్యాయుల మీద, కష్టనష్టాలలో, సుఖసంతోషాలలో నీతో ప్రయాణిస్తున్న నీ జీవితభాగస్వామిపై, దేవుని బహుమానాలైన నీ పిల్లలనుబట్టి, నిన్ను ఆత్మీయంగా బలపరుస్తున్న దైవసేవకులపై, ప్రార్థన సహకారం అందించే విశ్వాసులపై, ప్రభుత్వం పట్ల, నీకు ఉద్యోగం ఇచ్చినవారిపట్ల, నీ జీవనాధారమైన వృత్తిపట్ల ఇంకెంత కృతజ్ఞత ఉండాలి?". జీవితంలో ఎదురైన తుఫాను లు, నిందలు, అపజయాలపట్ల కూడా కృతజ్ఞత కలిగివుండాలి. అవే కదా మన వ్యక్తిత్వాన్ని, ఆత్మీయతను రూపుదిద్దుతాయి. 1 థెస్సలోనిక 5 : 18 - ప్రతి విషయమందును కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి. ఆలోచించు చాలు, కృతజ్ఞతతో నీ హృదయం నిండిపోతుంది.

## కృతజ్ఞత భావన ఉంటే -:

ఒక ఉపాధ్యాయుడికి అతని విద్యార్థులందరు కలిసి సన్మానసభను పెట్టారు ఆయన ను సన్మానించి, గౌరవించి కృతజ్ఞతను వ్యక్తం చేయడానికి. సన్మాన సభకి ఆ ఉపాధ్యాయుడు తనతోపాటు ఇంకొంతమందిని తీసుకునివచ్చాడు. స్టేజిమీదకి ఆయన్ని ఆహ్వానిస్తే తనతో పాటు వచ్చిన వారిని కూడా స్టేజీమీదకి తీసుకెళ్ళి, వారిని పరిచయం చేశాడు. వారికి నమస్కరించి కృతజ్ఞతలు తెలిపాడు. వాళ్లెవరెవరో ఊహించగలరా? మొదట తనని రోజూ స్కూల్‌కి రిక్షాలో తెచ్చిన వ్యక్తికి నమస్కరించాడు. తరువాత తన ఇంటిలో పనిచేసిన వ్యక్తికి నమస్కరించాడు. తనకు క్షవరంచేసే వ్యక్తికి కూడా నమస్కరించి సన్మానించాడు. తరువాత ఆయన మాట్లాడుతూ ఇలా అన్నారు. "ఈ ఉపాధ్యాయుడు ఉత్తమంగా విద్య అందించటానికి ఏ రక్తసంబంధం లేని వీళ్లు నా జీవిత ప్రయాణంలో నాకు సహకరించి, నేను ఈ స్థాయికి ఎదగటానికి తోడ్పడ్డారు. అందుకు నేను వారిని సన్మానించి, నా కృతజ్ఞతా భావనను వ్యక్తం చేశాను. మీరు నన్ను గౌరవిస్తున్నారు కానీ నా మనస్సు వీరిని గౌరవించాలి అనుకుంది కాబట్టి ఇలా చేశాను" అన్నారు. కృతజ్ఞతా భావం ఉంటే మనిషి ఆలోచన విధానం ఎంతో గొప్పగా, మాదిరికరంగా ఉంటుంది. కృతజ్ఞతా భావన లేకపోబట్టే మనిషి మృగంకన్నా క్రూరంగా ప్రవర్తిస్తున్నాడు. అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. జన్మస్థలం అనే పవిత్రమైన కృతజ్ఞతా భావన ఉంటే రేప్‌లు జరుగుతాయా? కృతజ్ఞతా భావన ఉంటే నీది కానిది నువ్వు ఆశించవు, నేరాలు తగ్గిపోతాయి. కేవలం కొంతమంది మీద మాత్రమే కాదు, మనం చెయ్యలేని గొప్పపనులు చేసేవారిపట్ల కూడా కృతజ్ఞత కలిగి ఉండాలి. **ఉదాహరణకు :** మురికి కాలువలు శుభ్రంచేసే వారిమీద కూడా! మనకు ఎన్ని వేల రూపాయలు ఇచ్చినా ఆ మురికిని శుభ్రం చేస్తామా? ఇంట్లో పనిచేసేవారు రాకపోతే ఎంత ఇబ్బందిపడాలో! వారికి జీతము ఇచ్చినా వారిపట్ల కూడా కృతజ్ఞత కలిగిఉండడమే సద్భావన. లోపాలు అందరిలో ఉంటాయి. కానీ కృతజ్ఞత చూపించగలిగిన మంచి లక్షణాలు

కూడా అందరిలో ఉంటాయి. అవి నువ్వు గుర్తుపట్టాలి. కృతజ్ఞతా భావన నీలో ఉద్భవించే కొలది కృతజ్ఞతను వ్యక్తం చేస్తావు. జీవితాంతం నీకు వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, సామాజికంగా సహాయం చేసినవారిపట్ల కృతజ్ఞత కలిగి జీవిస్తావు.

## కృతజ్ఞత భావన వెంటే - :

**కృతజ్ఞతా భావన వెంట అనేక ఆశీర్వాదాలు వస్తాయి (మత్తయి 15 : 35-37). కృతజ్ఞతా భావన అనేక సుగుణాలకు పుట్టినిల్లు.**

**1. కృతజ్ఞత భావన పాపానికి దూరంగా ఉంచి, నీలో సంస్కారాన్ని పెంచుతుంది.**

**2. కృతజ్ఞత భావన ఉంటె విజయం వరిస్తుంది (1 కొరింథి 15 : 57).**

**3. కృతజ్ఞత భావన ఆపదలో ఉన్నవారిని అక్కున చేర్చుకొని ఆదరించేలా చేస్తుంది.**

**4. కృతజ్ఞత భావన దేవుడు నీనుండి ఏమి ఆశిస్తున్నాడో తెలియజేస్తుంది (1 తిమోతి 2:1-3).**

**5. కృతజ్ఞత భావన నీ మనస్సును విశాలపరచి మంచి భావాలను వికసింపజేసి మనస్సుని ఉత్తేజంగా, తేజోవంతంగా చేసి మానసిక, శారీరక ఆరోగ్యాన్నిస్తుంది.**

**6. కృతజ్ఞత భావన ఉంటె యాజకుల వలె గొప్ప శబ్ధముతో ఆరాధిస్తాము (ఎజ్రా 3 - 11).**

**7. కృతజ్ఞత భావన నీలో ఉంటే నీద్వారా మేలు పొందినవారు నిన్ను అభిమానిస్తారు, అనేకమంది గుండెల్లో నిలిచిపోతావు.**

**8. కృతజ్ఞత భావన ఎలా బ్రతుకకూడదో, ఎలా బ్రతకాలో నేర్పిస్తుంది. ప్రతిదాని యొక్క విలువ గుర్తెరిగేలా చేస్తుంది.**

**9. కృతజ్ఞత భావన ఉద్యోగములో, వ్యాపారములో గుర్తింపు, గౌరవం తెస్తుంది (దానియేలు 6:10-28).**

**10. కృతజ్ఞత భావన ఆధ్యాత్మిక భావాలను వృద్ధిచేసి దేవుని ప్రేమను లోతుగా అర్థం చేసుకునేలా చేస్తుంది.**

## అత్యున్నతమైన కృతజ్ఞతా భావన -

మనుష్యులపట్ల కృతజ్ఞతా భావన ఉండటం మంచిదే కానీ సృష్టికర్తయైన దేవునిమీద ఇంకెంత కృతజ్ఞత భావన కలిగి ఉండాలి? మనకి ఈ జీవితాన్నిచ్చింది ఆయనే. మరణం తరువాత నిత్యమైన జీవితాన్ని ఇవ్వగలిగికూడా యేసుప్రభువే. మనల్ని ప్రాణంగా ప్రేమించి, మన దోషాల్ని భరించి, సర్వమానవాళి కొరకు సిలువలో ప్రాణత్యాగం చేసిన యేసుప్రభువు పట్ల ఉండాల్సింది అత్యున్నతమైన కృతజ్ఞత భావన. ఆ కృతజ్ఞతా భావనే అనేకమంది మిషనరీలు తమదేశాన్ని వదిలి చీకట్లో, అజ్ఞానంలో జీవిస్తున్న అనేకదేశాలను క్రీస్తు ప్రేమ ద్వారా వెలిగించారు. ఆ కృతజ్ఞతా భావనే ఎంతోమంది దైవసేవకులు సువార్తను ధైర్యంగా ప్రకటించటానికి పునాది వేసింది. జీవితమంతా ఆయన ఆజ్ఞలఅడుగుజాడల్లో నడిచి, ఆ మహాదేవుని ప్రేమను అర్థంచేసుకొని, సమాజానికి ఆ గొప్ప ప్రేమను పరిచయంచేస్తూ,

కృతజ్ఞత భావనతో ముందుకుసాగితే ఒకరోజు జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకుంటావు. నీజీవిత ప్రయాణం అర్థవంతంగా ఉంటుంది. నీద్వారా సమాజం ఉద్ధరించబడి అనేక మంది నీపట్ల కృతజ్ఞత భావన కలిగి ఉండేంత గొప్పస్థితికి యేసుప్రభువు నిన్ను హెచ్చిస్తాడు.

కృతజ్ఞత భావన ఎప్పుడు మొదలవుతుందో అప్పుడు ఆ వ్యక్తియొక్క ఉన్నతస్థితి మొదలైనట్టే. ప్రతిరోజు కృతజ్ఞత భావనతో ప్రారంభించబడి కృతజ్ఞత భావనతో ముగియాలి. కృతజ్ఞత భావన సమయాన్ని, సహజ వనరులని వృధా చేయనివ్వదు. సంతోషంగా ఉన్న వారందరు కృతజ్ఞత భావన కలిగి ఉండకపోవచ్చు కానీ కృతజ్ఞత భావన కలిగినవారు ఖచ్చితంగా సంతోషంగా ఉంటారు. **- మరనాత.**

---

## ( 14 వ పేజీ తరువాయి.. 'ప్రమాదపు అంచుల్లో' )

వెంటనే బయలుదేరలేదు. తనను కనానుకు రమ్మని ఆహ్వానించిన దేవుని యొద్దకు వెళ్ళి అనుమతి కోరటం విశేషం. యాకోబును, అతని కుటుంబమును ఐగుప్తుకు వెళ్ళమని దేవుడే అనుమతించాడు. ఎందుకంటే కరువు నుండి తప్పించటానికి, వారు త్రోసివేసిన యోసేపును దేవుడు ఏవిధంగా దీవించాడో తెలుపుటకు అనుమతించాడు. దేవుడు చెప్పే ప్రతి మాటలో ఒక అంతరార్థం దాగియుంటుందని మనము మర్చిపోకూడదు. అయితే షరతులు మర్చిపోకూడదు. ఐగుప్తుకు పంపిన దేవుడు వారితోకూడా వస్తానని చెప్పాడు, అది గొప్పసంగతి. కాని వెళ్ళి అక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకోమని ఎప్పుడూ, ఇక్కడా దేవుడు చెప్పలేదు. ప్రయాణముకు, అక్కడ కొన్ని రోజులు నివాసముండటానికి మాత్రమే అనుమతి ఉంది. కాని ఇశ్రాయేలీయుల చరిత్రను పరశుద్ధ లేఖనములలోనుండి పరిశీలన చేస్తే, వారు తమ తరాలు గతించిపోయేవరకు ఐగుప్తులో నిలిచిపోయారు. అందువలననే బానిసత్వమును అనుభవించారు. దేవుని మాట ఒకసారి వస్తే దానిని ఎప్పటికీ గ్రంటెడ్‌గా తీసుకొనకూడదు. యాకోబు మరియు అతని కుటుంబము తాము నివాసమున్న దైవస్థలము నుండి బయలుదేరుతున్న సమయంలో దేవుని వాగ్ధానము గుర్తుచేసుకొని ఉంటే బాగుండేది. వాగ్ధానము అంటే దేవుడే మనకు యిస్తున్న దానము. ఆ వాగ్ధానమే మన ప్రయాణముకు ఊపిరి కావాలి. తరములనుండి వస్తున్న వాగ్ధానమును మర్చిపోయి తమ సుఖముకోసం చూసుకుంటే దేవుడు చూస్తు ఊరుకోడు. ఆ వాగ్ధానం పొందుకోవడానికి ప్రయాసపడితేనే దీవెన లభిస్తుంది. ఆ వాగ్ధానం కోసమే అబ్రహాము 24 సంవత్సరాలు వేచిఉండాల్సి వచ్చింది. అదే వాగ్ధానం కోసం ఇస్సాకు తనచుట్టు ఉన్న ఫిలిష్తీయులతో పడనన్ని మాటలు పడవల్సివచ్చింది. ఆవాగ్ధాన నెరవేర్పు కాకుండా యాకోబు తప్పిపోతాడేమో నని దేవుడు లాబాను నుండి వెనుకకు తీసుకొచ్చారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇశ్రాయేలీయులు వాగ్ధాన జనాంగం. అనగా, వాగ్ధానం బలమనే పుట్టారు, వాగ్ధానం కోసమే జీవించాడు. మరి, ఆ వాగ్ధానమును కాదని వెళ్ళడం న్యాయం అంటారా? ఈ యాకోబు ప్రయాణమే ఇశ్రాయేలీయుల చరిత్రను మలుపు తిప్పింది. ప్రయాణాలల్లో మలుపులు ఉండటం సహజం కాని, ప్రయాణమే ఒక మలుపు తిరిగితే ఆ ప్రయాణీకులు ఏదరికి చేరతారో ఒక్కింత ఆలోచించాలి. **- మరనాత.**

# ఎఫెసీయులకు వ్రాసిన పత్రిక

## ( 7 వ భాగము )

( డిశంబరు సంచిక తరువాయి ) రెవ. అల్లూరి విశ్వప్రసాద్, విజయవాడ

## అంతరంగంలో శక్తి పొందుట :

ప్రభువైన యేసుక్రీస్తు నామములో శుభములు, వందనములు.

ఎఫెసీ 3 : 14-21 లో గల వాక్యభాగమును ధ్యానంచేద్దాం. ఎఫెసీపత్రికలో పౌలు రెండు ప్రాముఖ్యమైన ప్రార్థనలను ప్రస్తావిస్తున్నాడు. 1 : 15-23 వరకు వ్రాయబడిన **మొదటి ప్రార్థనలో విశ్వాసులు ఉన్నతమైన దైవిక భావాలతో అంతకంతకూ వర్థిల్లాలని కోరుతూఉన్నాడు.** ఇప్పుడు ధ్యానంచేస్తున్న భాగములో మరియొక ప్రార్థన వ్రాయబడిఉంది. దీని సారాంశము- **విశ్వాసులు అంతరంగములో దేవుని శక్తిని పొందుకోవాలి.** ఇది చాలా ప్రాముఖ్యమైన విషయం. ఒక దైవజనుడు - 'మీసంపదను మీ చేతితో పట్టుకోండి' అని చెబుతాడు. ఇక్కడ సంపదను చేతితో పట్టుకోవడమంటే దేవుడనుగ్రహించు జ్ఞానాన్ని పట్టుకోండి, దేవుని ఆత్మశక్తిని పొందుకోండి అని అర్థము. భౌతికంగా మనం సంపాదించినది మనం చేత్తోపట్టుకొని ఉండలేము. అది ఏదోకనాటికి కరిగిపోతుంది. అపోస్తలుడైన పౌలు **ఎఫెసీ 3 : 14,15 లో ఒక 'గొప్ప ఆహ్వానము'ను, 16-19 వచనములలో తన 'విన్నపము'ను, 20-21 వచనములలో 'అద్భుతమైన దీవెన వచనములను'** తెలియజేయుచున్నాడు.

## 1. గొప్పఆహ్వానము :- 'అంతరంగములో శక్తికలిగి దేవుని ఆత్మవలన బలపరచబడవలెను' (ఎఫెసీ 3: 14,15) :

**"ఈ హేతువు చేత పరలోకమందును భూమిమీదను ఉన్న ప్రతి కుటుంబము ఏతండ్రిని బట్టి కుటుంబమని పిలువబడుచున్నదో ఆ తండ్రి ఎదుట నేను మోకాళ్లూని మీరు అంతరంగ పురుషునియందు శక్తి కలిగి ఆయన ఆత్మవలన బలపరచబడునట్లుగాను..".** పౌలు భక్తుడు చెరలో ఉన్నప్పుడు చేసిన ఈ ప్రార్థనలో ఆత్మ సంబంధమైన స్థితిని, అనగా, మీ ఆత్మీయ, అంతరంగ పురుషుడు శక్తిపొందాలని, ఏకత్వం కలిగిఉండాలని చెబుతున్నాడు. మనము కేవలం భౌతికమైన ఆశీర్వాదములనేకాక ఆత్మీయ ఆశీర్వాదములను కూడా పొందుకోవాలి. కాబట్టి భౌతికసంబంధమైన అవసరతల కంటే ఆధ్యాత్మిక అవసరతల కొరకైన ఆసక్తి, ప్రార్థన మనలో పెరగాలి. అంతరంగములో శుద్ధికలిగి జీవించాలి. భౌతికంగా ఎన్ని పొందుకున్నా ఆత్మరక్షణ పోగొట్టుకుంటే ఏమి ప్రయోజనం? కాబట్టి నేను మోకాళ్లూని దేవుని సన్నిధిలో ప్రార్థన చేస్తున్నాను. కాబట్టి మీరును ఈ విధముగా ప్రార్థించాలి, ఎందుకంటే మీరు అంతరంగములో శక్తిపొందాలి. ముఖ్యముగా మన ఆలోచనలను, భావోద్రేకాలను నియంత్రించుకొనుట అంతరంగములో శక్తిని పొందినప్పుడే సాధ్యమౌతుంది కనుక మీ ఆంతరంగములో మార్పురావాలి అంటున్నాడు.

ఈ సందర్భంగా బైబిల్‌గ్రంథములో కొన్ని ప్రార్థనలను మనం చూద్దాం.

**"ఆ మనుష్యులు అక్కడినుండి తిరిగి సొదొమ వైపుగా వెళ్లిరి. అబ్రహాము ఇంక యెహోవా సన్నిధిని నిలుచుండెను"** (ఆదికాండము 18 : 22).

**"ఇశ్రాయేలీయుల సమాజకులందరు చూచుచుండగా సొలొమోను యెహోవా బలిపీఠము తట్టు నిలువబడి ఆకాశముతట్టు చేతులెత్తి ఇట్లనెను"**(1 రాజులు 8 : 22).

**"రాజైన దావీదు వచ్చి యెహోవా సన్నిధిని కూర్చుండి ఈలాగు మనవి చేసెను దేవా యెహోవా నీవు నన్ను ఇంత హెచ్చులోనికి తెచ్చుటకు నేను ఎంతటివాడను? నా యిల్లు ఏమాత్రపుది?"** (1 దినవృత్తాంతములు 17 : 16).

**భవిష్యత్తులో దేవుని రాజ్యాన్ని కట్టటానికి యేసుక్రీస్తు చేసిన ప్రార్థన - "కొంతదూరము వెళ్లి సాగిలపడి తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగి పోనిమ్ము. అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్తప్రకారమే కానిమ్మని ప్రార్థించెను"** (మత్తయి 26 : 39).

మనమును అటువంటి శక్తినిపొందాలని కోరుకుందాము, ప్రార్థనచేద్దాం. మన అంతరంగ పురుషుడు బలము పొందుకొంటే అపవాదిని ఎదిరించడానికి, ధైర్యముగా నిలబడటానికి మనం శక్తిమంతులము అవుతాము.

పౌలు యొక్క ప్రార్థనలో ప్రాముఖ్యముగా త్రిత్వమైన దేవునిని అనగా, తండ్రియైన దేవున్ని, కుమారుడైన యేసుప్రభువును, పరిశుద్ధాత్మని తన ప్రార్థనలలో జ్ఞాపకం చేసుకొనే వాడు. ఈవిధంగా త్రిత్వమైయున్న దేవుని గుణలక్షణములను గుర్తిస్తూ మనము ప్రార్థించాలి. మనందరము దేవుని పిల్లలము, ఆయన మన తండ్రియైయున్నాడు. **"మనము దేవుని పిల్లలమని పిలువబడునట్లు తండ్రి మనకెట్టి ప్రేమననుగ్రహించెనో చూడుడి; మనము దేవుని పిల్లలమే.** ఈ హేతువుచేత లోకము మనలను ఎరుగదు. ఏలయనగా అది ఆయనను ఎరుగలేదు"(1యోహాను 3 : 1). మనము క్రీస్తును రక్షకుడుగా అంగీకరించినప్పుడు దేవుడు మన తండ్రి అవుతాడు. మీ అంతరంగములో శక్తి పొందాలంటే ముందు క్రొత్తగా జన్మించాలి. **'మీరు క్రొత్తగా జన్మించవలెనని నేను మీతో చెప్పినందుకు ఆశ్చర్యపడవద్దు'** అంటాడు ప్రభువైన యేసుక్రీస్తు నికోదేముతో ! (యోహాను 3 : 7). మీ పాపములు, బలహీనతలు విడిచిపెట్టి, రక్షణ పొందాలి. అప్పుడే మనము దేవుని కుమారులముగా స్వీకరించబడతాము.

## 2. పౌలుయొక్క విన్నపము :- 'దేవుని సంపూర్ణతలోనికి ఎదగవలెను'

**(ఎఫెసీ 3 : 16-19) : "క్రీస్తు మీ హృదయములలో విశ్వాసము ద్వారా నివసించునట్లుగాను, తన మహిమైశ్వర్యముచొప్పున మీకు దయచేయవలెననియు, మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా, ప్రేమయందు వేరుపారి స్థిరపడి, సమస్త పరిశుద్ధులతోకూడ దాని వెడల్పు, పొడుగు, లోతు, ఎత్తు ఎంతో గ్రహించుకొనుటకును, జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును తగిన శక్తిగలవారు కావలెననియు ప్రార్థించుచున్నాను".** దేవుని సంపూర్ణతలోనికి మనము ఎదగాలంటే దేవుని ప్రేమ మనలో ఉండాలని, నాలుగు విషయాలను ఇక్కడ తెలియజేస్తూ- వాటిని ఒకదానికొకటి అనుసంధానము చేస్తూ వ్రాస్తున్నాడు. అవి ఏమనగా -

**1) 'బలము'- బలవంతులము కావాలని**

**2) 'లోతు'- మీరు ఆధ్యాత్మికముగా లోతైన అనుభవమును పొందాలని**

**3. 'భయము లేనివారై ఉండాలని'**

**4. 'సంపూర్ణత్వము' మీలో ఉండాలని.**

**ఎ) బలము (strength) :-** 'క్రీస్తు మీ హృదయములలో విశ్వాసము ద్వారా నివసించునట్లుగాను' (ఎఫెసి 3 : 16). **విశ్వాసమనే బలము మనకు కావాలి. మనకు అంతరంగములో బలము, ఆత్మలో బలము, శోధనలను జయించే బలము, పాపానికి దూరముగా ఉండే బలము అత్యంత అవసరము.** 3 : 16 లో ఆయన మహిమైశ్వర్యము మనము పొందుకొనుటకు దేవుని యొక్క ఆత్మశక్తి కలిగిఉండాలి. "దేవునిఆత్మ మీలో నివసించియున్నయెడల మీరు ఆత్మ స్వభావము గలవారేగాని శరీర స్వభావము గలవారు కారు"(రోమా 8 : 9). మరియు "పరిశుద్ధాత్మ మీమీదికి వచ్చునప్పుడు మీరు శక్తినొందెదరు"(అపో॥ కా॥ 1 : 8) అని వ్రాయబడిఉంది. యేసుక్రీస్తు సహితము పరిశుద్ధాత్మతో నింపబడి సేవచేసాడు. "యేసు పరిశుద్ధాత్మపూర్ణుడై యొర్దానునది నుండి తిరిగివచ్చి, నలువది దినములు ఆత్మచేత అరణ్యములో నడిపింపబడి"..(లూకా 4 : 1). తదుపరి యేసు, ఆత్మ బలముతో గలిలయకు తిరిగి వెళ్లెను. "దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మతోను, శక్తితోను అభిషేకించెను. దేవుడాయనకు తోడైయుండెను గనుక ఆయన మేలుచేయుచు, అపవాదిచేత పీడింపబడిన వారినందరిని స్వస్థపరచుచు సంచరించుచుండెను" (అపో॥ కా॥ 10 : 38).

మనము దేవునిసన్నిధిలో ఆశపడునంతగా దేవుడు తనయొక్క ఆత్మను, ఆశీర్వాదము ను మనకు ఇస్తాడు. నేను ఒక ధనవంతుడినయితే నాకున్న ధనములోనుంచి కొంత మాత్రమే ఇవ్వగలుగుతాను. కానీ దేవుడు మనమెంత కావాలని కోరుకొంటామో అంత ఇస్తాడు. తనకున్నదంతా ఇస్తాడు. ఎంతగా దేవునిసన్నిధిలో ప్రార్థనలో నమ్మకముగా జీవిస్తామో అంతగా మన అంతరంగములో శక్తినొందుతాము, దైవశక్తిని మనమెంత సంపాదించుకో గలిగితే అంత ! దేవునికి స్తోత్రం కలుగును గాక !

ఈ ప్రార్థనలో పౌలుయొక్క తాత్పర్యము అంతరంగపురుషుడు 'బలము' పొందాలని. అపవిత్రమైన ముచ్చట్లతో సమయాన్ని వెచ్చిస్తుంటే అంతరంగ పురుషుడిని అపవాది స్వాధీనము చేసుకొంటాడు. అంతరంగ పురుషుడు బలాన్ని పొందలేడు, కృశించిపోతాడు, శోధనలను జయించలేము. కాబట్టి - "అపవిత్రమైన ముసలమ్మ ముచ్చట్లను విసర్జించి దేవభక్తి విషయములో నీకు నీవే సాధకము చేసుకొనుము" (1 తిమోతి 4 : 8). సాతాను ప్రభువునొద్దకు వచ్చి అంతరంగ పురుషుడిని శోధించినప్పుడు ప్రభువు పలికిన మాటఇది- **"అందుకాయన - మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుకాని దేవుని నోటనుండి వచ్చు ప్రతి మాట వలన జీవించును"** (మత్తయి 4 : 4). శరీరమునకు వృద్ధాప్యము వచ్చేస్తుంది, చనిపోతుంది, కృశించిపోతుంది కాని, అంతరంగ పురుషుడు దినదినము నూతన పరచబడాలి. "కావున మేము అధైర్యపడము; మా బాహ్య పురుషుడు కృశించుచున్నను, ఆంతర్యపురుషుడు దినదినము నూతన పరచబడుచున్నాడు" (2 కొరింథి 4 : 16). దేవుని యొక్క ఆత్మశక్తి ఎప్పుడైతే అంతరంగములోనికి వస్తుందో అద్భుతమైన కార్యాలు దేవుడు జరిగిస్తాడు.

దేవుని సన్నిధిలో ప్రార్థన చేయండి, ప్రతిరోజూ వాక్యమనే ఆహారముతో అంతరంగ

పురుషుడిని నింపండి. వాక్యముతో, ప్రార్థనతో లోపలివ్యక్తిని పోషిద్దాం. ప్రతిదినము శరీరాన్ని శుద్ధిచేసుకొంటున్న రీతిగా అంతరంగ పురుషుడిని దేవుని ప్రేమచేత విధేయతతో, ఆరాధనతో శుద్ధిచేసుకొంటూ, అభ్యాసముచేస్తూ, బలము పొందుకొంటూ ముందుకు సాగిపోదాం. ఎవరికివారే మీ అంతరంగపురుషుని తొంగిచూసుకొని పరిశీలన చేసుకోండి.

**బి) లోతు (depth) :-** "తన మహిమైశ్వర్యము చొప్పున మీకు దయచేయవలె ననియు, మీరు దేవుని సంపూర్ణతయందు పూర్ణులగునట్లుగా, **ప్రేమయందు వేరుపారి స్థిరపడి,** సమస్త పరిశుద్ధులతోకూడ దాని వెడల్పు, పొడుగు, లోతు, ఎత్తు ఎంతో గ్రహించు కొనుటకును.." (ఎఫెసీ 3 : 17, 18). మనము దేవుని ప్రేమలో వేరుపారి, పాతుకుపోవాలి, అది మనలో స్థాపితమైపోవాలి. అప్పుడే మనలోనున్న దేవుని ఆత్మ రోజురోజుకు బలాన్ని పొందుకొంటుందని పౌలు ఈ ప్రార్థన చేస్తున్నాడు.

దుష్టుల ఆలోచన చొప్పున నడుస్తూ, పాపుల మార్గమున నిలిచి, అపహాసకులు కూర్చుండుచోట కూర్చుంటే మనకు బలము రాదు. దేవుని సన్నిధిలోనే బలమున్నది. "యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు - నరులను ఆశ్రయించి శరీరులను తనకాధారము గా చేసికొనుచు, తన హృదయమును యెహోవామీదనుండి తొలగించుకొనువాడు శాపగ్రస్తుడు. వాడు ఎడారిలోని అరూహావృక్షము వలె ఉండును; మేలు వచ్చినప్పుడు అది వానికి కనబడదు, వాడు అడవిలో కాలిన నేలయందును నిర్జనమైన చవిటి భూమి యందును నివసించును. **యెహోవాను నమ్ముకొనువాడు ధన్యుడు, యెహోవా వానికిఆశ్రయముగా ఉండును. వాడు జలములయొద్ద నాటబడిన చెట్టువలె నుండును; అది కాలువల ఓరను దాని వేళ్లు తన్నును; వెట్ట కలిగినను దానికి భయపడదు, దాని ఆకు పచ్చగానుండును, వర్షములేని సంవత్సరమున చింతనొందదు కాపు మానదు" (యిర్మియా 17 : 5-8).** పైపైన కట్టిన ఇల్లు వానలు కురిసి, వరదలు వచ్చి, గాలి విసురునప్పుడు కూలిపోతుంది. కాని, బండమీద పునాది వేయబడిన ఇల్లు ఎన్ని వచ్చినప్పటికి ఎంతో బలంగా ఉంటుంది. ఈరోజు దేవునిలో మీ పునాది ఎలా ఉంది?

**సి) నిర్భయము (fearless) :- "ప్రేమలో భయముండదు, అంతేకాదు; పరిపూర్ణ ప్రేమ భయమును వెళ్లగొట్టును; భయము దండనతో కూడినది. భయపడువాడు ప్రేమయందు పరిపూర్ణము చేయబడినవాడు కాడు"** (1 యోహాను 4 : 18). "జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలుసుకొనుటకును తగిన శక్తిగలవారు కావలెనని ప్రార్థించుచున్నాను" (ఎఫెసీ 3: 18, 19). ఈరోజు నుంచి మన ప్రార్థన స్థాయిని పెంచుకొందాం. భయపడకుండా దేవునివైపు చూద్దాం.

**డి) సంపూర్ణత (fullness) :- "మీరు దేవుని సంపూర్ణతలో పరిపూర్ణులగునట్లుగా.."** అని అపొస్తలుడైన పౌలు ప్రార్థన చేస్తున్నాడు. **"నన్ను బలపరచువానియందె నేను సమస్తము చేయగలను"** అని మరొకచోట ప్రస్తావిస్తాడు. మనలను బలపరచు దేవునియందే మనము సంపూర్ణతస్థాయికి ఎదగగలము.

## 3. అద్భుతమైన దీవెన వచనములు (ఎఫెసీ 3 : 20, 21) :- "మనలో

**కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగువాటన్నిటికంటె, ఊహించువాటన్నిటికంటె అత్యధికముగా చేయగల దేవునికి క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు సదాకాలము మహిమ కలుగునుగాక, ఆమేన్".** ఆత్మ సంబంధమైన ఆలోచనలోనికి మనం వచ్చినప్పుడు తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ దేవుడు తోడైయుండి మనలను నడిపిస్తాడు. **" అత్యధికముగా చేయ శక్తిగల దేవునికి "** అనగా, ఆయన మనం అనుకున్నదానికంటె అత్యధికముగా చేస్తాడు. అది జరగాలంటే ఆత్మలో మనం వర్ధిల్లాలి. అనేకమంది అంతరంగములో బలాన్ని పొందుకోలేకపోవుటకు కారణము అపనమ్మకత్వము, అవిశ్వాసము, తన పాపమును ఒప్పుకోలేనటువంటి స్థితి. మీరు క్షమాపణ కోరలేని పాపములు లోపల పెట్టుకున్నందువల్లనే మీ అంతరంగ పురుషుడు వర్ధిల్లటము లేదు. ఎంత ఘోరపాపములో ఉన్నప్పటికి దేవుని సన్నిధిలో దానిని ఒప్పుకోవాలి. ఈనాడు అనేకమంది భక్తులు నిర్లక్ష్యముతో కూడిన ఇష్టానుసారమైన జీవితము జీవించడం వలన అంతరంగములో బలాన్ని పొందుకోలేక పోతున్నారు.

అంతరంగములో శక్తిని పొందకుండా మనమెంత విశ్వాసవీరులమైనా, గొప్పగొప్ప కార్యాలు చేసినప్పటికి ప్రయోజనం లేకపోగా, దేవునికి అవమానం వచ్చే ప్రమాదముంది. ప్రతివిషయములో మనము దేవునికి మహిమ వచ్చునట్లుగా జీవిద్దాం. "క్రీస్తుయేసు మూలముగా సంఘములో తరతరములు, సదాకాలము మహిమ కలుగునుగాక"!. క్రీస్తు సంఘము అభివృద్ధి చెందాలంటే ప్రతి విశ్వాసిలో ఉన్న అంతరంగ పురుషుడు బలమును పొందుకోవాలి. తద్వారా అనేకమందిని ప్రభువు కొరకు నడిపించగలము. దేవుడు మీకు తోడైయుండి నడిపించును గాక! **- మరనాత.** **( సశేషం )**



# 'అట్టివారై యుండుడి' - 17

**(గత సంచిక తరువాయి)** **రెవ. బి.యం. రాజు, విజయనగరం**

పాఠక మిత్రులకు శుభములు.

**7) గిద్యోను బూర ఊదినవాడు :-** (న్యాయాధి॥ 6 : 34) యెహోవా ఆత్మ గిద్యోనును ఆవరించెను. అతడు బూర ఊదినప్పుడు అబీయెజరు కుటుంబము వారు అతని యొద్దకు వచ్చిరి. గిద్యోను బూర ఊదుటద్వారా జనులు ఆకర్షించబడిరి. బూర శబ్ధము జనులను ఆకర్షించు శక్తిగలది. ఆనాటి కాలములో యుద్ధమునకు గాని, ఆరాధనకుగాని ప్రజలను సమకూర్చుటకు ఊదుచుండిరి. బూరను "బాకా"యని, "కొమ్ము" అనియు కూడ తెనిగించిరి.

**బూర ఊదుట :-** బూర ఊదుట అనగా సువార్త ప్రకటించుట అని అర్ధము. సువార్త ప్రకటించాలనేది దేవుని ఆజ్ఞ. "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి" (మార్కు 16 : 15). సువార్త ప్రకటించకపోయిన యెడల ఆజ్ఞ అతిక్రమించుటయే. ఆజ్ఞ అతిక్రమమే పాపము. పాపము వల్ల వచ్చు జీతము మరణము. గనుక గిద్యోను బూర ఊదినట్లుగా మీరును సువార్తను ప్రకటించాలి.

సువార్త ప్రజల జీవితాలలో గొప్ప పరివర్తన కలిగించేదిగా ఉండాలి. అనేకులు యేసుక్రీస్తుని హత్తుకొనేటట్లు చేయగలగాలి. ప్రజల జీవితాలలో పాపపు ఒప్పుకోలు కలిగించాలి, సువార్త ప్రజలకు రక్షణ, సంతోషము, సౌభాగ్యములను కలుగజేసి, పరలోక ప్రాప్తిని ప్రసాదించేదిగా ఉండాలి.

## లేఖనములలో కొందరు :

**1) ఇశ్రాయేలు చిన్నది :-** (2 రాజులు 5 : 2, 3). ఈ చిన్నది చెఱగొనిరాబడినది. నయమాను ఇంటి పనిపిల్లగా చాకిరీచేయుచున్నది. ఆ ఇంట పనిచేస్తు ఆ ఇంటిపరిస్థితులను గమనిస్తూ ఉంది. ఆందోళన కలిగించే సంగతి బయటపడింది. ఆ సంగతి తెలుసుకొని ఆ ఇంటివారి మీదగాని, నయమాను గారిమీద గాని ఆవేశము, పగ కనబరచలేదు. నా దేశమునకు, నా ప్రజలకు నష్టము కలిగించినవారికి నా దేవుడు భలేగా బుద్ధిచెప్పాడు, వీరికి తగిన శాస్తి జరిగింది అని సంతోషించలేదు. ఆ కుటుంబము యొక్క నాశనమును కోరుకొనలేదు.

దేవుని ప్రేమను పొందుకున్నవారు ఆ ప్రేమను ఇతరులపట్ల చూపించుటకు వెనుకాడరు. ఇశ్రాయేలు చిన్నది అలాంటి మనస్సు కలిగియుండి, నయమాను భార్యకు ఒక సలహా ఇస్తుంది. "షోమ్రోనులోనున్న ప్రవక్త దగ్గర నా యేలినవాడు ఉండవలెనని నేను ఎంతో కోరుచున్నాను". అతడు నా యేలినవానికి కలిగిన కుష్ఠరోగమును బాగుచేయునని తన యజమానురాలితో అనెను (2 రాజులు 5 : 3). చిన్నది చెప్పిన మాట ప్రకారముగా

నయమాను చేసి స్వస్థతను పొందుకొని "ఇశ్రాయేలులోనున్న దేవుడు తప్ప లోకమంతటి యందును మరియొక దేవుడు లేడని నేను ఎరుదునని సాక్ష్యమిచ్చెను (2 రాజులు 5 : 15). నయమాను స్వస్థత పొందుటకు, దేవుడు మహిమపరచబడుటకు ఇశ్రాయేలు చిన్నది "బూర ఊదుటనుబట్టి" అంతటి ఘనకార్యము జరిగింది. గనుక "మీరును అట్టివారై యుండండి".

**2) సమరయ స్త్రీ :-** (యోహాను 4వ అధ్యాయం) యేసుక్రీస్తు ప్రభువు వారు ఒకమారు సమరయ మార్గమున వెళ్ళవలసి వచ్చెను. ఆ ప్రయాణములో అలసియున్న కారణము చేత యేసు ఒక బావిదగ్గర కూర్చొనియుండగా, 12 గంటల సమయములో సమరయ స్త్రీ నీళ్ళు చేదుకొనుటకు అక్కడికి రాగా యేసు ఆమెను చూచి - "నాకు దాహమునకిమ్మని ఆమెను అడిగెను". అందుకు ఆమె యూదుడవైన నీవు సమరయస్త్రీనైన నన్ను దాహమున కిమ్మని యేలాగు అడుగుచున్నావని ఆయనతో అనెను. ఈవిధముగా ఇరువురి మధ్య ఎంతో సంభాషణ జరిగింది. వెంటనే ఆ స్త్రీ తన కుండను విడిచిపెట్టి "ఊరిలోనికి వెళ్ళి మీరు వచ్చి నేను చేసినవన్నియు నాతో చెప్పిన మనుష్యుని చూడుడి. ఈయన క్రీస్తుకాడా యని ఊరివారితో చెప్పగా "సమరయస్త్రీ బూర ఊదినది" (సువార్త చెప్పినది). భయము, సిగ్గు విడిచి ఊరిప్రజలమధ్యకు వెళ్ళి బూర ఊదినది (సువార్త చాటింది).

"నేను చేసినవన్నియు నాతో చెప్పెనని సాక్ష్యమిచ్చిన స్త్రీ యొక్క మాటనుబట్టి ఆ ఊరిలోని సమరయులలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి" (యోహాను 4 : 39). విశ్వాసముంచుట మాత్రమే గాక ఆ ఊరి ప్రజలు ఆ స్త్రీని చూచి ఇకమీదట నీవు చెప్పిన మాటనుబట్టి గాక, మామట్టుకు మేము విని యీయన నిజముగా లోకరక్షకుడని తెలుసుకొని నమ్ముచున్నామనిరి" (యోహాను 4 : 41-42). ఎంత గొప్ప సాక్ష్యము. సమరయ స్త్రీ బూర ఊదినందున (సువార్త చెప్పినందున) ఆ గ్రామము రక్షించబడియున్నది, దాని ఫలితము దేవుడు మహిమపరచబడెను. "మీరును సమరయ స్త్రీవలె బూర ఊది (సువార్త చాటి) దేవుని ఆజ్ఞను నెరవేర్చండి".

**3) అపోస్తలుడైన పౌలు :-** ఒకప్పుడు క్రీస్తు సువార్తను నిర్మూలము చేయాలనే పట్టుదల కలిగిన సౌలు దమస్కు మార్గములో దైవప్రత్యక్షత పొందుకొన్న తరువాత ఆ సువార్త నిమిత్తము ఎన్నో ప్రయాణములుచేసి, అనేక దేశాలకువెళ్ళి, ఎన్నో శ్రమలు అనుభవించెను. సువార్త సత్యము ఎరిగి ఆ సువార్త ఆయన జీవితములో ఎలాంటి మార్పు కలిగించినదో ఎరిగినవాడై "సువార్తను ప్రకటింపకపోయిన యెడల నాకు శ్రమ" అని పౌలు భక్తుడు మాటలాడుచున్నాడు (1 కొరింథి 9 : 16). మీరు పౌలు అంతటివారు కాకపోయిన, మీ పరిధిలో దేవుడు మీకిచ్చిన పరిమాణ ప్రకారము దేవుని పరిచర్యను జరిగించు, సువార్తను చాటించు, దేవుని కృప మీకు తోడైయుండును గాక! (1 థెస్సలోనిక 1 : 4,8; మార్కు 5 : 19) ఈ లేఖనములను కూడ చదవండి. **- మరనాత.** **( సశేషం )**

# వార్తల్లో కొన్ని...

## హెచ్ఐవీ 'మూలాలు' అవుట్

**మూలకణ చికిత్సతో వైరస్ మాయం...**
**లండన్ వాసికి పూర్తిగా తగ్గిన వ్యాధి**
**రోగం నయమైన రెండో వ్యక్తిగా రికార్డు...**
**మూలకణ చికిత్సలో కీలక పాత్ర పోషించిన భారత శాస్త్రవేత్త రవీంద్ర గుప్తా**

**విజయవాడ, మార్చి 6 :** 'ఎయిడ్స్‌కు మందు లేదు నివారణ ఒక్కటే మార్గం.. ఇది ఒకప్పటి మాట కాబోతోంది. ఆ వ్యాధిపై విజయం సాధించేందుకు మనిషి సిద్ధమవుతున్నాడు. హెచ్ఐవీని మాయం చేసే చికిత్స త్వరలోనే అందుబాటులోకి రాబోతోంది. శరీరంలో వైరస్ మూలాలే లేకుండా చేసే 'మూలకణ చికిత్స'ను శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. హెచ్ఐవీ సోకిన ఓ లండన్ వ్యక్తికి ఈ చికిత్స చేయగా రోగం పూర్తిగా నయమైంది. ఫలితంగా ప్రపంచంలోనే హెచ్ఐవీ నుంచి ఉపశమనం పొందిన రెండో వ్యక్తిగా రికార్డు సాధించాడు. యూకేలోని యూనివర్సిటీ కాలేజీ లండన్, ఇంపీరియల్ కాలేజీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి వర్సిటీల శాస్త్రవేత్తల బృందం సదరు రోగికి చికిత్స అందించి వైద్య చరిత్రలో మరో ముందడుగు వేశారు. దీనికి సంబంధించిన వివరాలను మార్చి 5, మంగళవారం అమెరికాలోని సీటెల్‌లో జరిగిన హెచ్ఐవీ సదస్సులో పరిశోధకులు వెల్లడించారు. 2003లో సదరు వ్యక్తికి హెచ్ఐవీ సోకింది. అప్పటి నుంచి చికిత్స తీసుకుంటుండగానే 2012లో కాన్సర్ బారిన పడ్డాడు. కేన్సర్ కోసం కీమోథెరపీ తీసుకున్నాడు. 2016లో హెచ్ఐవీ నిరోధక శక్తి కలిగిన ఓ వ్యక్తినుంచి సేకరించిన మూలకణాల తో అతడికి మార్పిడి చేయగా కేన్సర్, హెచ్ఐవీ నుంచి ఒకేసారి విముక్తుడయ్యాడు. 18 నెలలుగా అతడు హెచ్ఐవీ నయంచేసే ఔషధాలు వాడటం లేదని, ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాడని **చికిత్సకు నేతృత్వం వహించిన భారతసంతతి పరిశోధకుడు రవీంద్ర గుప్తా** తెలిపారు. చికిత్సను 'అసంభవమైన సంఘటన'గా అభివర్ణించారు.

## 12 ఏళ్ల క్రితమే హెచ్ఐవీ నయం

తొలిసారిగా 12 ఏళ్ల క్రితమే జర్మనీకి చెందిన తిమోతీ రే బ్రౌన్ అనే వ్యక్తికి సోకిన ఎయిడ్స్ వ్యాధిని వైద్యులు నయంచేశారు. ఎముక మజ్జ మార్పిడి ద్వారా అతడు వైరస్ నుంచి విముక్తి పొందాడు. ప్రస్తుతం అతడు ఆరోగ్యంగా ఉన్నాడని, లండన్ వాసిలోనూ అలాంటి చికిత్స చేశామని పరిశోధకులు వెల్లడించారు. చికిత్సపై మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందని, భవిష్యత్తులో వారికి ఈ వైరస్ సోకకుండా అవసరమయ్యే విధానాలపై దృష్టి సారించినట్లు వివరించారు.

## ఎన్నో విఫలయత్నాలు

బ్రౌన్‌కు చికిత్స చేసి హెచ్ఐవీ నుంచి విముక్తి కల్పించి 12 ఏళ్లయినా మరొక వ్యక్తి మాత్రమే ఈ చికిత్సద్వారా హెచ్ఐవీ నుంచి బయటపడ్డాడు. ఎంతోమందికి మూల కణ చికిత్స చేయాలని చూసినా ఫలితం లేకపోయింది. కణ దాతలు లేకపోవడం, కణ మార్పిడివల్ల దుష్ప్రభావాలు తలెత్తడం లాంటి సమస్యలు ఎదురయ్యాయి. కొన్ని సందర్భాల్లో కొత్త నిరోధక వ్యవస్థపై హెచ్ఐవీ నియంత్రిత వ్యవస్థ దాడిచేయడం లాంటి సంఘటనలు తలెత్తినట్లు పరిశోధకులు తెలిపారు.

## మూలకణ చికిత్స చేశారిలా..

మనుషుల్లో సీసీఆర్5 అనే జన్యువు ఉంటుంది. గుండెపోటు నుంచి కోలుకునేప్పుడు ఇది ప్రభావం చూపుతుంది. హెచ్ఐవీ రోగ నిరోధక వ్యవస్థను తన ఆధీనంలోకి తీసుకునే చోటు ఇదే. అంటే హెచ్ఐవీకి ప్రవేశద్వారం లాంటిది. కొంతమందిలో 'ముటేషన్లు' ఉంటాయి. అవి సీసీఆర్5 జన్యువు పనితీరును అడ్డుకుంటాయి. అంటే.. ఆ మ్యుటేషన్లు కలిగినవారి శరీరంలోకి వైరస్ ప్రవేశించినా ఆ ముటేషన్లు దాన్ని నియంత్రిస్తాయి.

వారినుంచి సేకరించిన మూలకణాలనే బెర్లిన్, లండన్‌కు చెందిన రోగుల శరీరంలోకి ప్రవేశపెట్టి రోగాన్ని నయం చేశారు.




-: ప్రతుల కొరకు : -

విజయవాడ - 89777 61512: 0866- 2480047

హైదరాబాద్ - 99896 98072

విశాఖపట్నం - 94405 74118

R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Krishna Lanka, VIJAYAWADA - 520 013.
Printed on 08-02-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month

మరనాత విశ్వాస సమాజము సమర్పించు

# మరనాత దర్శనం

ఆధ్యాత్మిక టీ.వీ. కార్యక్రమములు

దైవదాసులు శ్రీ గుళ్లపల్లి మోజెస్ చౌదరి,

దైవదాసులు శ్రీమతి & శ్రీ అల్లూరి విశ్వప్రసాద్

దైవదాసులు డా॥ నిరీక్షణ కంచర్ల గార్లు

ఆధ్యాత్మిక వర్తమానములు అందించెదరు.

## కల్వరి ఛానల్‌లో

Calvary TV

బుధవారం రాత్రి 8 - 8 : 30 గంటల వరకు
శుక్రవారం ఉదయం 6:30 - 7 గంటల వరకు
శనివారం రాత్రి 7 - 7 : 30 గంటల వరకు

## ఆరాధన ఛానల్‌లో

ఆరాధన ARADHANA

గురువారం ఉదయం 7 - 7 :30 గంటల వరకు

## శుభవార్త ఛానల్‌లో

SUBHAVAARTHA TELEVISION

సోమవారం మధ్యాహ్నం 1 :30 - 2 వరకు
శుక్రవారం రాత్రి 9 :30 - 10 గంటల వరకు